# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 13 ఆగష్టు 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 219 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## మీరు చనిపోయినందుకు సంతోషం!?!



2

నోట్ల కట్టల న్యాయమూర్తి వ్యవహారం

## జస్టిస్ వర్మపై ఆరోపణలు నిరూపితం



2

---

పార్లమెంటులో చర్చిద్దాం

# ప్రతి ప్రశ్నకూ జవాబిస్త

### విలేకరుల సమావేశంలో అమిత్ షా



ఢిల్లీ, ఆగష్టు 12: పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్సభ స్పీకర్ ఓం బిర్లా కు లేఖ

...మిగతా 2లో

---

# గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించాలె



### సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలె

### పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు వేగవంతం చేయండి

### గూడెందొడ్డి స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీని నియమించండి

### నీటి పారుదల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 12: గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్హెచ్ఆర్డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి

...మిగతా 2లో

---

# 11.56 లక్షల పీఎంఏవై ఇండ్లు కేటాయించండి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

### తెలంగాణ పర్యటనకు రావాల్సిందిగా కేంద్ర మంత్రికి ఆహ్వానం



హైదరాబాద్ ఆగస్టు 12: తెలంగాణ గ్రామీణ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ను ఎంపీలు డా. మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, మండాది అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి మంత్రి పొంగులేటి కలిశారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ అవసరాలను వివరిస్తూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ హౌసింగ్

...మిగతా 2లో

## క్యూర్ పరిధిలో నేడు ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

కూకట్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న సీఎం

2

---

# మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే

## విధివిధానాలు రూపొందించాలె

### ధాన్యం నిల్వకు అయిదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు

### పౌరసరఫరాల సమీక్షలో అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 12: మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం

...మిగతా 2లో

---

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రామచందర్‌రావే రథసారధి

### అసమ్మతి నేతలకు చెక్ పెట్టిన బీజేపీ అధిష్టానం

### ముఖ్య నేతలను సమన్వయం చేస్తూ ముందుకు..



హైదరాబాద్ (మనం బ్యూరో): రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో అధికారాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కమలనాథులు ఆ దిశగా పకడ్బందీ కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఎన్నికలలోగా బీజేపీని బలోపేతం చేసి అధికార కాంగ్రెస్ పార్టీని ఢీకొట్టాలన్న వ్యూహం తో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలోనే

...మిగతా 2లో

---

# పారిశ్రామిక వేత్తలను బెదిరించి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నరు

### ఆ రూ.200 కోట్లు ఎక్కడివో కేటీఆర్ చెప్పాలె

### ప్రజలతో ముఖాముఖిలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 12, మనం బ్యూరో: బీఆర్ఎస్ నేతలు పారిశ్రామికవేత్తలను బెదిరించి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామిక సంస్థలకు నిబంధనల ప్రకారమే భూ కేటాయింపులు జరుపుతున్నట్లు స్పష్టం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు సమర్పించి వాటి పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భూ కేటాయింపులపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారనీ, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు తెలిపారు. ఐదెకరాల భూమిని రూ.7.5 కోట్లకు

...మిగతా 2లో

---

## ధ్రువీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు

### తెలంగాణ జీవోపై కేంద్ర ఎన్నికల కమిషన్ క్లారిటీ

చెన్నై, ఆగష్టు 12: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ధ్రువీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీపై జులై 25న తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ కార్డు

...మిగతా 2లో

---

### కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై

# హైకోర్టు స్టే



హైదరాబాద్, ఆగష్టు 12: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. చట్టబద్ధత లేకుండా కేవలం జీవోల ద్వారా ఈ పథకాలను అమలు చేస్తున్నారంటూ న్యాయవాది విజయ్ గోపాల్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో హైకోర్టు విచారణ చేపట్టింది. చట్టసభల్లో తీర్మానం చేయకుండా తీసుకొచ్చిన పథకాలు చెల్లవని విజయ్ గోపాల్ వాదించారు. గత విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. 4 వారాలైనా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని విజయ్ గోపాల్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్టే విధించిన ఉన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

---

# తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ఆసక్తి



- మంత్రి తుమ్మలతో బిహార్ వ్యవసాయశాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా భేటీ
- ఆయిల్ పామ్ పై బిహార్ ఆసక్తి.. మకానాపై తెలంగాణ ఆసక్తి
- రైతుబంధు, రైతు బీమా, సన్నాలకు బోనస్ వంటి పథకాల అమలు తీరును వివరించిన తుమ్మల

హైదరాబాద్, ఆగష్టు 12: బీహార్ వ్యవసాయశాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీహార్-తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యవసాయరంగంలో పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగంలో అమలు

...మిగతా 2లో

---



# హెచ్ఐవీ రహిత తెలంగాణే లక్ష్యం

### నెక్లెస్ రోడ్డులో 1500 మందితో అవగాహన ర్యాలీ

### రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం

### నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: మంత్రి

2

## పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి

రేపు సీఎం చేతుల మీదుగా ఆవిష్కరణ • బీసీ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులతో సన్నద్ధత సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

---

# జేపీసీకి విదేశీ విరాళాల బిల్లు

ఢిల్లీ, ఆగష్టు 12: లోక్‌సభలో ఇటీవల ప్రవేశపెట్టిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదిత బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. మొత్తం 31 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఏర్పాటు చేయగా.. ఇందులో 21 మంది లోక్ సభ, పది మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (సవరణ) బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మైనారిటీలు, ఎన్జీవోలను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం దీనిని

...మిగతా 2లో

---

# ఇమ్రాన్ ఖాన్ మృతి?

- సీనియర్ సైనికాధికారులు చెప్పారని జర్నలిస్టు పోస్ట్
- ధృవీకరించని జైలు అధికారులు
- పాకిస్థాన్‌లో ఆందోళనలు

ఇస్లామాబాద్,ఆగష్టు 12: పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు సయీద్ ఖాన్ అనే ఆ దేశ జర్నలిస్ట్ సంచలన పోస్ట్ పెట్టారు. ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారని తనకు ముగ్గురు సీనియర్ సైనికాధికారులు చెప్పారని పేర్కొన్నారు. దీంతో ఆయన ఆరోగ్య పరిస్థితిపై పాక్ ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు,

...మిగతా 2లో



---



### కొలంబియా భూకంపంలో

# 3 వేల మంది గల్లంతు!

### మృతుల సంఖ్య 224

బొగోటా,ఆగష్టు 12: దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాను సోమవారం నాటి భారీ భూకంప విషాదం కుదిపేస్తోంది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదు కాగా, ఈ విలయంలో ఇప్పటివరకు 224 మంది ప్రాణాలు కోల్పోయారు. 3,000 మందికి పైగా గల్లంతు కాగా, వీరి కోసం మంగళవారం గాలింపు చర్యలు కొనసాగాయి. పశ్చిమ కొలంబియాలోని

...మిగతా 2లో

---

# ఇరాన్‌కు మమ్మల్ని బలిచేస్తరా?

### భద్రతా సిబ్బందిపై పాత్రికేయుల ఆగ్రహం

వాషింగ్టన్,ఆగష్టు 12: పశ్చిమాసియా ఘర్షణలు, ఇరాన్ బెదిరింపుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఎయిర్‌ఫోర్స్‌వన్‌ను వదిలి మరో చిన్నవిమానంలో ప్రయాణించిన సంగతి తెలిసిందే. ఈ సీక్రెట్ ఫ్లైట్‌ను తాజాగా ట్రంప్ ధ్రువీకరించారు. మరోవైపు పాత్రికేయుల్ని, ఇతర సిబ్బందిని వదిలేసి.. భద్రతా సిబ్బంది అధ్యక్షుడిని ఒక్కరినే తరలించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మమ్మల్ని ఇరాన్‌కు బలిచేస్తారా..? అంటూ పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జులైలో టర్కియే రాజధాని అంకారాలో నాటో సదస్సు జరిగింది. ఖతార్ కానుకగా ఇచ్చిన బోయింగ్ 747-8లో అంకారాకు ట్రంప్ వెళ్లారు. కానీ వచ్చేటప్పుడు.. పాత ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కినట్లు ప్రపంచానికి చూపించారు. కానీ భద్రతా సిబ్బంది ఆయనను క్యాటరింగ్ ట్రక్కులో తరలించి, చిన్నవిమానంలో టర్కియే దాటించారు. దీనిపై ట్రంప్ మాట్లాడారు. "సీక్రెట్ సర్వీస్, సైన్యం నా భద్రతను నిర్ణయిస్తుంది. వారు నన్ను వేరే విమానంలో వెళ్లమన్నారు. వారు చెప్పినట్లే జరిగింది. నాకు ఏదో ముప్పు ఉండిఉండొచ్చు. కానీ ఆ విషయం గురించి నేను పెద్దగా మాట్లాడలేదు. ప్రాముఖ్యత ఉన్న అధ్యక్షులకే ఇలాంటి బెదిరింపులు వస్తుంటాయి. అయితే నేను ప్రయాణించిన యూఎస్ మిలిటరీ విమానానికే ఎక్కువ ముప్పు ఉందని అనుకుంటున్నా. అలాంటి వాటినే వారు ఎక్కువగా గురి పెడతారని

...మిగతా 2లో

# ఇరాన్‌కు మమ్మల్ని బలిచేస్తరా?

(మొదటి పేజీ తరువాయి)

నా అభిప్రాయం'' అని ట్రంప్ పేర్కొన్నారు.అయితే ఇరాన్ బెదిరింపుల నేపథ్యంలోనే ట్రంప్‌ను తరలించారనే విషయం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ఉన్న పాత్రికేయులు, ఇతర సిబ్బందికి తెలియదు. అధ్యక్షుడితో పాటు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా చిన్న విమానంలో బ్రిటన్‌కు చేరుకున్నారు. కానీ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్‌వన్లోనే ఉన్నారని నమ్మించేలా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది వేసిన ఎత్తుగడ తీవ్రవిమర్శలకు దారితీసింది. మిగిలిన వారిని అలా వదిలేయడం ఏంటని నిఘా విభాగానికి చెందిన మాజీ అధికారులు ప్రశ్నించారు. ''ట్రంప్‌ను వేరే విమానం ఎక్కించారు సరే.. ఎయిర్‌ఫోర్స్ వన్లో ఉన్న మిగిలిన సిబ్బందిని సురక్షితంగా ఉంచడానికి ఏ చర్యలు చేపట్టారో సమాధానం చెప్పాలి'' అని డెమోక్రట్ నేతలు డిమాండ్ చేశారు.

# ఇమ్రాన్ ఖాన్ మృతి?

(మొదటి పేజీ తరువాయి)

ఇమ్రాన్‌ఖాన్‌ను కలిసేందుకు ఆయన కుటుంబసభ్యులకు అధికారులు అనుమతినివ్వక పోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమ నేతకు ఏదైనా జరిగితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధుల్లోకి రావడానికి 20 లక్షలమంది సిద్ధంగా ఉన్నారని ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి, తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ నేత సోహైల్ అఫ్రిది పేర్కొన్నారు. అప్పుడు యువత ఆగ్రహాన్ని కట్టడి చేయడానికి మొత్తం సైన్యం కూడా సరిపోదన్నారు. ఇమ్రాన్‌ఖాన్‌ను కలవడానికి ఆయన కుటుంబానికి, వైద్యులకు ప్రవేశం నిరాకరిస్తే నిరసనలు చేపడతామని పీటీఐ హెచ్చరించింది. సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్ వైపు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే ఈ విషయంపై పాక్ ప్రభుత్వం కానీ.. జైలు అధికారులు కానీ ఎటువంటి ప్రకటన చేయలేదు.

# జేపీసీకి విదేశీ విరాళాల బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చిందని, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లును విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయని సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. దీంతో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. చట్టపరమైన కార్యాచరణ లేకుండా విదేశీ నిధులను దేశంలోకి అనుమతించలేమన్నారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకునేలా ఎలాంటి నిబంధనలు ఇందులో లేవని, ఈ విషయంలో విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు.

# కొలంబియా భూకంపంలో 3 వేల మంది గల్లంతు!

(మొదటి పేజీ తరువాయి)

పలు నగరాలు, పట్టణాల్లో ఇప్పటికీ శిథిలాల కింద ఎంతోమంది చిక్కుకొని ఉన్నారు. భూకంప తీవ్రత వల్ల సుమారు 1,600 భవనాలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వం తెలిపింది. పెరీరా నగరం భూకంప ధాటికి ఎక్కువగా ప్రభావితమైంది. ఈ ప్రాంతంలో పెద్దసంఖ్యలో జనం చనిపోయినట్లు అధికారులు తెలిపారు. కాఫీ సాగుకు ప్రసిద్ధి చెందిన పర్వత ప్రాంతం మానిజాలెస్ నగరంలోనూ ప్రాణనష్టం వాటిల్లింది.

# ధ్రువీకరణ పత్రంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు

(మొదటి పేజీ తరువాయి)

డేటా ఆధారంగా సర్టిఫికెట్ జారీ చేసేలా ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈసీఐ క్లారిటీ ఇచ్చింది. 'సర్'లో ధ్రువీకరణకు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఆమోదించడానికి కుదరదని స్పష్టం చేసింది. ఆ సర్టిఫికెట్ రేషన్కార్డుతో సమానమని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) తెలియజేశారు.

# హెచ్ఐవీ రహిత తెలంగాణే లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 12(మనం న్యూస్): రాష్ట్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ తదితర మహమ్మారి వ్యాధుల రహిత సమాజ స్థాపనకు తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించింది. వ్యాధుల నియంత్రణ, నివారణే ధ్యేయంగా బుధవారం హైదరాబాద్‌లో భారీ అవగాహన ర్యాలీని నిర్వహించారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద ఈ ప్రతిష్టాత్మక ర్యాలీని హైదరాబాద్ ఇంచార్జి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 1500 మంది విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్న ఈ ప్రదర్శన హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు సాగింది. హెచ్ఐవీ నివారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు.

**అపోహలు వీడా:**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సమాజంలో ఉన్న అపోహలను, వివక్షను తొలగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 'స్టాప్ హెచ్ఐవి పాసిటివ్ ' అనే నినాదంతో తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సమన్వయంతో కట్టుబడి ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఎవరూ హెచ్ఐవీ బారిన పడకుండా నివారణ చర్యలు చేపట్టడంతో పాటు, హెచ్ఐవీ బాధితులకు అవసరమైన నాణ్యమైన వైద్య సేవలు, సామాజిక మద్దతు అందించాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా అత్యాధునిక చికిత్సలు హెచ్ఐవీ సోకిన తల్లుల నుంచి పుట్టబోయే పిల్లలకు వైరస్ సంక్రమించకుండా అడ్డుకునే అత్యాధునిక వైద్య సేవలు, ఉచిత చికిత్సలు ప్రభుత్వ రంగంలో అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగానే బుధవారం నుంచి రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచార, అవగాహనకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పొన్నం ఉద్ఘాటించారు.ఈ ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు, వైద్య నిపుణులు, అవగాహన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలను బెదిరించి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నరు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చామని చెప్పిన మంత్రి కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు సూచించారు. హిల్ట్ పాలసీతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందనీ, పారిశ్రామికవేత్తలను భయపెట్టి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. నీటి వాటాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. మాపై ఉన్న కోపాన్ని ప్రజలపై చూపకండి, గోబెల్స్ ప్రచారంతోనే మీ పార్టీని గత ఎన్నికలలో ఓడించారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాలు కొనసాగించిన విధానాలనే తాము కొనసాగిస్తున్నామనీ, నీటి వాటాల్లో రాష్ట్రానికి బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. జీఆర్ఎంబీ మీటింగ్‌కు హాజరవుతాం బలంగా కొట్లాడుతామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# ప్రతి ప్రశ్నకూ జవాబిస్త

(మొదటి పేజీ తరువాయి)

రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో ''కనిపించడం లేదు'', ''పారిపోయారు'' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.

# పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయండి

హైదరాబాద్, ఆగస్టు 12(మనం న్యూస్): సామాజిక విప్లవకారులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల ఆశయ సాధనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రేపు సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్ ఎదురుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు.ఈ చారిత్రాత్మక కార్యక్రమం, అనంతరం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో బీసీ ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన కీలక సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ఈర్లపల్లి శంకరయ్య, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పూలే ఆశయాల ఆచరణే**

**ప్రభుత్వ సంకల్పం:**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, వారి ఆశయాలను ప్రభుత్వ పాలనలో, భవిష్యత్ కార్యాచరణలో ప్రతిబింబించేలా చూసే సంకల్పమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, కులగణన కోసం బలంగా పోరాడుతున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తోందన్నారు. జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం, సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఇది కేవలం ఒక వర్గానికి పరిమితమైనది కాదని, సామాజిక న్యాయాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరి కార్యక్రమమని, అందువల్ల పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

**భారీ ఏర్పాట్లు:**

ఈ చారిత్రాత్మక వేడుకకు నగర ప్రజలు, బీసీ సంఘాలు స్వచ్ఛందంగా తరలివచ్చేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, భద్రత తదితర అంశాలపై సంబంధిత ప్రభుత్వ విభాగాలతో ఇప్పటికే సమీక్షించామని వెల్లడించారు. ఇదే ఉత్సాహంతో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను కూడా ఈనెల 18న సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అధికారికంగా, అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పొన్నం బీసీ సంఘాల నాయకులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# మీరు చనిపోయినందుకు సంతోషం!?!

రాయ్ పూర్, ఆగష్టు 12: 'మా ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని.. కోలుకొని వెళ్లినందుకు సంతోషం' అంటూ చనిపోయిన పేషెంట్ ఫోన్‌కు ఓ ఆస్పత్రి మెసేజ్ పంపింది. ఆ రోగి అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 42 రోజుల క్రితమే ప్రాణాలు కోల్పోవడం ఈ సందర్భంగా గమనార్హం. ఛత్తీస్ గఢ్ లోని రాయ్ పూర్ లో వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాయ్ పూర్ కు చెందిన కానిస్టేబుల్ దేవనారాయణ్ రామ్ (39) అనారోగ్య కారణాలతో జూన్ 26న అంబికాపూర్లోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేరారు. అదే హాస్పిటల్లో ఆయన భార్య సీమా నర్సుగా పని చేస్తున్నారు. చికిత్స పొందుతూ దేవనారాయణ్.. అదే నెల 30న ప్రాణాలు కోల్పోయారు. దానితో కుటుంబ సభ్యులు ఆయనకు అంత్యక్రియలు నిర్వహించి.. మరణ ధ్రువీకరణ పత్రం సైతం తీసుకున్నారు. దేవనారాయణ్ మరణించిన నెల రోజుల తర్వాత ఆగస్టు 6న ఆయుష్మాన్ భారత్ పథకం కింద మృతుడి ఫోన్ కు ఆస్పత్రి నుంచి ఒక సందేశం వచ్చింది. అందులో 'ప్రియమైన దేవనారాయణ్ మీరు మా ఆసుపత్రిలో చికిత్స తీసుకొని.. కోలుకొని వెళ్లినందుకు సంతోషంగా ఉంది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద అందించే ఉచిత ఆరోగ్య సంరక్షణ సేవలతో మీరు సంతృప్తి చెందారని ఆశిస్తున్నాం' అని అందులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబం ఆసుపత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్పిదం వల్ల ఈ పొరపాటు జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ తప్పిదం చేసినందుకు అతడిని విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. అయితే, కానిస్టేబుల్ కుటుంబం మాత్రం ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తం చేసింది. తన భర్త జూన్ 30న ప్రాణాలు కోల్పోతే.. ఏప్రిల్ 6న డిశ్చార్జ్ అయినట్లు మెసేజ్ వచ్చిందని సీమా పేర్కొన్నారు. మరణానంతరం తన భర్త ఆయుష్మాన్ కార్డును ఆసుపత్రి వర్గాలు దుర్వినియోగం చేశాయని ఆమె ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఆమె ఆరోపణలను ఆసుపత్రి యాజమాన్యం ఖండించింది. పోర్టల్లో ఆయుష్మాన్ క్లెయిమ్ను మూసివేయడంలో జాప్యం చోటుచేసుకోవడం వల్లే ఈ సందేశం ఆలస్యంగా వచ్చిందని తెలిపింది. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి సీజన్లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రామచందర్‌రావే

# బీజేపీ రాష్ట్ర రథసారధి

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లనున్నట్లు బీజేపీ అధినాయకత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చనున్నారంటూ గత కొద్ది రోజులుగా పార్టీలోని కొద్దిమంది నేతలు చేస్తున్న అసత్య ప్రచారానికి చెక్ పెట్టినట్లయింది. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగాల్సి ఉండగా, జమిలి ఎన్నికల ప్రతిపాదన అమలులోకి వస్తే 2029 మే లేదా జూన్‌లో జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రామచందర్‌రావుకు ఇంకా రెండేళ్లకు పైగా పదవీ కాలం ఉండటంతో మధ్యలో పార్టీ అధ్యక్షుడిని మారిస్తే ఎన్నికల వరకు కొత్త అధ్యక్షుడు కుదురుకునే అవకాశం ఉండదని బీజేపీ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావు గత ఏడాది పార్టీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ముఖ్య నేతలందరితో సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, పార్టీ మాజీ ఎంపీ లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్ వంటి కీలక నేతలతో కలిసి పార్టీ పటిష్టానికి కృషి చేస్తున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తమ మధ్య గత కొంతకాలంగా నెలకొన్న విభేదాలను సైతం పక్కనబెట్టి ఐక్యంగా ముందుకు సాగేలా చేయడం రామచందర్‌రావు చేసిన కృషి ఫలితమేనని పార్టీలోని కొందరు నేతలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, మరికొద్ది రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. అనంతరం మూడు నగర పాలక కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతాయి.

గతంలో ఎమ్మెల్సీగా,బీజేపీ హైదరాబాద్ నగర అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పని చేసిన అనుభవం రామచందర్‌రావుకు ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, నగర పాలక కార్పొరేషన్ల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలంటే రామచందర్‌రావు సమర్థ నాయకత్వం అవసరమని పార్టీ జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు తెలిసింది. దీనికి తోడు బీజేపీ రాష్ట్ర సారధిగా రామచందర్‌రావు ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నారనే అభిప్రాయంబలంగా ఉంది. రాష్ట్రంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలంటే రాష్ట్ర సారధిగా రామచందర్‌రావును కొనసాగించడమే ఉత్తమమని అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది.

# గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించాలె

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు.

గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్హౌజ్ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ నియమించాలని సీఎం ఆదేశించారు.

# నోట్ల కట్టల న్యాయమూర్తి వ్యవహారం

## జస్టిస్ వర్మపై ఆరోపణలు నిరూపితం పార్లమెంటు ముందుకు నివేదిక

ఢిల్లీ, ఆగష్టు 12: జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో కాలిన కరెన్సీ నోట్లు బహిర్గతమైన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీ దర్యాప్తు నివేదిక బుధవారం పార్లమెంటు ముందుకు వచ్చింది. నగదు లెక్క చూపకపోవడం, సాక్ష్యాధారాలు చెదిరిపోవడం, వివరణలో దాటవేత ధోరణి అనే ఆరోపణలు నిరూపితమయ్యాయని నివేదిక తేల్చింది.

ఆ నగదు అక్కడ ఎందుకు ఉంది? అది ఎవరిది? ఎక్కడి నుంచి వచ్చింది? అనే ప్రశ్నలకు జస్టిస్ యశ్వంత్ వర్మ సరైన వివరణ ఇవ్వలేకపోయారు. చట్టపరమైన తనిఖీలు, సీలింగ్ కు ముందు భౌతిక సాక్ష్యాధారాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించలేదు. స్టోర్ రూమ్ లో సాక్ష్యాధారాల స్థితి చెదిరిపోయింది. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ ఇచ్చిన వివరణలో నిష్పాక్షికత, పారదర్శకత, బాధ్యత కనిపించలేదు. అది దాటవేత ధోరణిలో, అసంతృప్తికరంగా ఉంది'' అని కమిటీ తన నివేదికలో తెలిపింది.

# తెలంగాణ వ్యవసాయ విధానాలపై బిహార్ ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న సాంకేతిక ఆధారిత కార్యక్రమాలు, రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీహార్ మంత్రి విజయ్ కుమార్ సిన్హాకు వివరించారు. వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేయడం, రైస్ నేస్తం ద్వారా రైతులతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా అనుసంధానం, క్రాప్ బుకింగ్, శాటిలైట్ ఆధారిత పంటల పర్యవేక్షణ, యూరియా బుకింగ్ అప్లికేషన్, అగ్రిస్టాక్ ద్వారా రైతు గుర్తింపు వంటి డిజిటల్ కార్యక్రమాలను వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత 'కృషివాస్' పంటల పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా పంటల్లో సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లోనే సత్వర చర్యలు చేపట్టడం ద్వారా రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, దిగుబడిని పెంచడం, లాభదాయకతను మెరుగుపర్చే విధానాలను మంత్రి తుమ్మల వివరించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో రైతుల కోసం అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ తదితర కార్యక్రమాల అమలు తీరును బీహార్ మంత్రికి వివరించారు. రైతుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, సంవత్సరానికి రైతుభరోసా పథకం కింద ఎకరానికి 12000 ఇస్తున్నామని తెలిపారు. సన్నాలకు 500 బోనస్ అందిస్తున్నామని, దేశంలోనే అత్యధిక వరి పండించిన రాష్ట్రం తెలంగాణే అని అన్నారు.

రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ఇస్తున్న ప్రాధాన్యతను కూడా మంత్రి తుమ్మల వివరించారు. తెలంగాణలో వరి, పత్తితో పాటు మొక్కజొన్న, కందులు, సోయాబీన్, మామిడి, ఎర్ర మిరప, పసుపు, ఆయిల్పామ్ తదితర పంటల సాగు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆయిల్పామ్ సాగులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, 2025-26లో 3.11 లక్షల ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు ఉండగా, 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తితో 20.01 శాతం ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ రేషియో సాధించినట్లు వివరించారు. తెలంగాణలో ఆయిల్పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ మిల్లులు, మైక్రో ఇరిగేషన్ వంటి మౌలిక సదుపాయాలపై కూడా బీహార్ మంత్రి ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇదే సమయంలో బీహార్లో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యీకరణ, పంటల క్లస్టర్ల విధానం, సాంకేతిక వినియోగం తదితర అంశాలను బీహార్ మంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా తెలంగాణ ప్రతినిధులకు వివరించారు. బీహార్లో చిన్న, సన్నకారు రైతులు 91 శాతం ఉండగా, వ్యవసాయంపై ఆధారపడే జనాభా 77 శాతంగా ఉందని, వ్యవసాయ ఉత్పత్తుల వైవిధ్యానికి అనుగుణంగా ప్రత్యేక పంటల క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

# క్యూర్ పరిధిలో నేడు ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

## కూకట్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి

**ఏడాదిలో గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక ● తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8 వేళ్లు ● మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, ఆగస్టు 12 (మనం బ్యూరో): నేడు క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. కూకట్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ఈ మేరకు రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం ఏడాదిలో పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8 వేళ్లు పూర్తి చేస్తామన్నారు. నాలుగు టవర్లలో భాగంగా ఒక్కో టవర్‌లో 120 చొప్పున ఫ్లాట్స్, ఒక్కో ఫ్లోర్‌లో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుందనీ, దీనికోసం రూ.43.20 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందనీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదలు నగరానికి దూరంగా కాకుండా నగరంలోనే జీవించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి గత నెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామనీ, ఇప్పటి వరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోనికి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15వ పొడిగించినట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# 11.56 లక్షల పీఎంఏవై ఇండ్లు కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలనలో ఇళ్ల కోసం 21 లక్షల దరఖాస్తులు వచ్చాయని మంత్రి తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ ప్లస్-2024 యాప్ ద్వారా ఇంటింటా సర్వే నిర్వహించగా 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా గుర్తించబడ్డాయని చెప్పారు. సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు. అర్హులైన కుటుంబాల జాబితాను రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాం. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కూడా అనేక దఫాలుగా కేంద్రం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. స్వయంగా ప్రధానమంత్రి గారి దృష్టికి కూడా తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారు తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భాల్లోనూ రాష్ట్ర గృహ అవసరాలను ఆయన దృష్టికి తీసుకువచ్చాను అని పొంగులేటి తెలిపారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదల గృహ నిర్మాణం నిలిచిపోవడంతో భారీ డిమాండ్ ఏర్పడిందని, ఈ నేపథ్యంలో అర్హులైన 11,56,915 కుటుంబాలకు ఒకేసారి ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.

**ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రాష్ట్ర సాయం**

కింద కేంద్ర వాటాతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్లో కేటాయించినట్లు చెప్పారు. పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే దాదాపు 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. కేంద్రం నుంచి ప్మఆ్వ-ఎ ఇళ్ల కేటాయింపు జరిగితే గ్రామీణ పేదల సొంతింటి కలను మరింత వేగంగా నెరవేర్చగలం అని మంత్రి అన్నారు.

**తెలంగాణ పర్యటనకు రావాలని ఆహ్వానం**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. ప్మఆ్వ-ఎ 2.0 కింద తెలంగాణకు ఇళ్ల కేటాయింపును స్వయంగా రాష్ట్రానికి వచ్చి ప్రకటిస్తే గ్రామీణ పేదలకు మరింత భరోసా కలుగుతుందని తెలిపారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## నీట్ యూజీ లాంగ్ టర్మ్ కోచింగ్

- 22 లోగా దరఖాస్తు చేసుకోవాలె
- టీజీఎస్‌డబ్ల్యూఆర్ కార్యదర్శి కంభంపాటి శారద

హైదరాబాద్, ఆగష్టు 12 : వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చే ఏడాది నిర్వహించే నీట్ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇదో సువర్ణావకాశం. 2027లో జరగనున్న నీట్ యూజీ పరీక్ష కోసం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉచితంగా లాంగ్ టర్మ్ కోచింగ్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇందుకోసం అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఆగస్టు 22లోగా దరఖాస్తు చేసుకోవచ్చని సొసైటీ కార్యదర్శి కంభంపాటి శారద వెల్లడించారు.

2026 - 27 అకడెమిక్ ప్రోగ్రామ్ లో భాగంగా నిర్వహించే ఈ లాంగ్ టర్మ్ నీట్ కోచింగ్ అబ్బాయిలు, అమ్మాయిలకు వేర్వేరుగా నిర్వహించనున్నారు. 100 బాలురకు చిలుకూరులోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సీవోఈలో, 100 మంది బాలికలకు మహేంద్ర హిల్స్ ఫౌండేషన్ వద్ద శిక్షణ ఇవ్వనున్నట్లు శారద తెలిపారు.

2025-26 విద్యా సంవత్సరంలో ఏదైనా కాలేజీలో బైపీసీలో ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ శిక్షణకు అర్హులని శారద తెలిపారు. అలాగే, 2026 నీట్ పరీక్ష రాసిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. తమ అధికారిక వెబ్సైట్ నుంచి నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తును పొందవచ్చని సూచించారు. అనంతరం దరఖాస్తు నింపి, అన్ని ధ్రువపత్రాలను జత చేసి సంబంధిత అప్లికేషన్ను సంబంధిత కోచింగ్ ఇచ్చే చిలుకూరు, మహేంద్రహిల్స్‌లోని ఆయా కాలేజీల్లో టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా సమన్వయకర్త (డీసీవో) ద్వారా సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా కీలక అడుగు

**వంద శాతం సబ్సిడీతో 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ**

**నేడు సచివాలయంలో పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, ఆగస్టు 12(మనం న్యూస్): బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న నిరుపేద, నిరుద్యోగ బీసీ మహిళలకు నూటికి నూరు శాతం ప్రభుత్వ సబ్సిడీతో (ఉచితంగా) ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 శాసనసభ నియోజకవర్గాల్లో.. నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను అందించనున్నారు. లబ్ధిదారులపై పైసా ఆర్థిక భారం పడకుండా, పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతోనే వీటిని అందజేయడం ఈ పథకం ప్రత్యేకత.

**సచివాలయంలో లాంఛనంగా ప్రారంభం:**

నేడు మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర సచివాలయం (జీ-29) వేదికగా ఈ పథకాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. మహిళాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కుట్టుపనిలో నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక యంత్రాలను అందించడం ద్వారా, వారు తమ ఇళ్ల వద్దనే ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే ఉంచకుండా, ఆదాయాన్ని ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**విధివిధానాలు వెల్లడించనున్న మంత్రి పొన్నం:**

ఈ కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, అవసరమైన అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానం తదితర పూర్తి వివరాలను నేటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా వెల్లడించనున్నారు. పేద బీసీ మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేసే దిశగా ఈ పథకం ఓ కీలక ముందడుగుగా నిలవనుందని సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది.

# డిగ్రీ కాలేజీలకు ఇన్‌చార్జులే ప్రిన్సిపాళ్లు?

**75 డిగ్రీ కాలేజీల్లో లేని రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు**

**విద్యార్థులకు తప్పని తిప్పలు**

**పదోన్నతుల్లో జాప్యం, సీనియారిటీ వివాదాలే కారణం**

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దాదాపు సగం వరకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు లేకుండానే కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 159 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 75 చోట్ల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని 'క్వాలిఫైడ్ గవర్నమెంట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్' వెల్లడించింది. ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల దైనందిన పరిపాలనతో పాటు ప్రవేశాలు, విద్యాపరమైన పర్యవేక్షణపై తీవ్ర ప్రభావం పడుతోందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒక్కో ప్రిన్సిపాల్ రెండు, మూడు కళాశాలల అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల ఏ ఒక్క కళాశాలపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రవేశాలు, పరీక్షల సమయంలో ధ్రువపత్రాలు, ఉపకారవేతనాలు, హాజరు వంటి అంశాల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో చాల కాలంగా అధ్యాపకుల నియామకాలు, పదోన్నతుల్లో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలే ఈ ఖాళీలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 151 మంది అర్హులైన అధ్యాపకులు పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. వివిధ బ్యాచ్‌ల సీనియారిటీ జాబితాలపై నెలకొన్న వివాదమే ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. 1998 బ్యాచ్‌కు చెందిన జూనియర్ అధ్యాపకులను, తర్వాత కాలంలో వచ్చిన 2001, 2002, 2004, 2005 బ్యాచ్‌ల కంటే సీనియర్లుగా గుర్తించాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది.

ఈ అంశంపై అసోసియేషన్ అధ్యక్షుడు, ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ టీ.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా ఈ 75 ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా కళాశాలల పరిపాలన మెరుగుపడటంతో పాటు, పదవీ విరమణకు చేరువలో ఉన్న సీనియర్ అధ్యాపకులకు సముచిత గౌరవం, అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# హైడ్రా సేవలు రాష్ట్రమంతా విస్తరింప చేయండి

**పట్టణాల్లో వరదలు అడ్డుకోవాలంటే 'హైడ్రా'నే శరణ్యం**

**కమిషనర్ రంగనాథ్‌ను కోరిన 'స్పీక్' ప్రతినిధులు**



హైదరాబాద్, ఆగస్టు 12(మనం న్యూస్): తెలంగాణలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో.. చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములు కబ్జాకోరుల పాలు కాకుండా ఉండాలంటే 'హైడ్రా' సేవలను రాష్ట్రవ్యాప్తం చేయాలని వివిధ జిల్లాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో, బుధవారం పలు జిల్లాల ప్రతినిధులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిజామాబాద్, కామారెడ్డి, సిద్ధిపేట, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 'స్పీక్' (సొసైటీ ఫర్ పీపుల్స్ ఎంపవర్ మెంట్ విత్ యాక్షనబుల్ నాలెడ్జ్) ప్రతినిధులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితమే హైడ్రా వంటి పటిష్టమైన వ్యవస్థ వచ్చి ఉంటే, హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గొలుసుకట్టు చెరువులన్నింటినీ కాపాడుకునేవాళ్లమని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.

**కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు:**

కొందరు కబ్జాదారులు తప్పుడు సమాచారంతో కోర్టులను, ఇతర ప్రభుత్వ శాఖలను తప్పుదారి పట్టిస్తున్నారని, వారి పట్ల అన్ని విభాగాలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రతినిధులు హితవు పలికారు. తెలంగాణలోని పలు పట్టణాలు వరదల బారిన పడటానికి అక్రమ ఆక్రమణలే ప్రధాన కారణమని ధ్వజమెత్తారు. గత ఏడాది వరంగల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సంభవించిన వరద బీభత్సమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా చెరువులు, వరద కాలువలు కబ్జా కాకుండా జాగ్రత్త పడితేనే భవిష్యత్తులో వరద ముప్పును తగ్గించగలమని వారు స్పష్టం చేశారు.

**హైడ్రాతోనే పర్యావరణ హితం:**

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హైడ్రా తరహా వ్యవస్థ అందుబాటులోకి వస్తేనే ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేసే వారికి భయం ఏర్పడుతుందని ప్రతినిధులు పేర్కొన్నారు. పర్యావరణ హితమైన తెలంగాణ సాధ్యం కావాలన్నా, ప్రభుత్వ భూములు పరిరక్షించబడాలన్నా హైడ్రా సేవలను జిల్లాలకు సైతం విస్తరించడం అత్యంత ఆవశ్యకమని కమిషనర్ రంగనాథ్‌కు ప్రతినిధి బృంద సభ్యులు విజ్ఞప్తి చేశారు. అక్రమార్కులు ఎంతటి వారైనా వెనక్కి తగ్గకుండా మరింత బలమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# మత్తుపై మహాసంగ్రామం పది కోట్ల మందితో ప్రతిజ్ఞ లక్ష్యం



- కేంద్ర ప్రభుత్వ 'నషాముక్త్ భారత్ అభియాన్'లో బ్రహ్మకుమారీస్ మెగా ప్రచారం
- ఎస్కీలో మిషన్ స్పందన్ 'అడిక్షన్ ఫ్రీ' కార్యక్రమం

హైదరాబాద్,ఆగష్టు 12(మనం న్యూస్): మాదకద్రవ్యాల రహిత నవభారత నిర్మాణమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నషాముక్త్ భారత్ అభియాన్' ఉద్యమం దేశవ్యాప్తంగా సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏకంగా 10 పది కోట్ల మందితో మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞలు చేయించే బృహత్తర మెగా ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు శాంతి సరోవర్ ప్రతినిధి బ్రదర్ సూరత్ సింగ్ వెల్లడించారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 'అడిక్షన్ ఫ్రీ ప్లెడ్జ్' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలేజీ సిబ్బందితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి శిక్షణ కోసం విచ్చేసిన సుమారు రెండు వందల మంది ప్రతినిధులు ఏకకంఠంతో మాదకద్రవ్యాలకు నో చెప్పండి - ఆరోగ్యకరమైన జీవితానికి అలవాటు పడండి అంటూ దృఢ సంకల్పంతో ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలో లక్ష మందితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని బ్రదర్ సూరత్ సింగ్ తెలిపారు. ఈ మహత్తర ప్రచార ఉద్యమాన్ని ఈ నెల 2వ తేదీన గవర్నర్ ఘనంగా ప్రారంభించారని, ఈ ప్రచారం నెల 20వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన వివరించారు. 140 కోట్ల జనాభా కలిగిన దేశంలో 10 కోట్ల ప్రతిజ్ఞలనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదని, ఇది సమాజంలో క్రమంగా రాబోయే పెను మార్పునకు, ప్రతి కుటుంబ వ్యవస్థ చక్కబడటానికి,ప్రతి ఒక్కరి ఆరోగ్యకరమైన జీవనశైలికి ఒక సువర్ణ అవకాశమని ఆయన ఆకాంక్షించారు.

**వ్యక్తిగత వినాశనమే కాదు.. దేశ ప్రగతికి గండం..**

మాదకద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని క్షీణింపజేయడమే కాకుండా, సదరు కుటుంబ వ్యవస్థను సైతం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని సూరత్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముక లాంటి యువత ఈ అలవాట్ల బారిన పడి తమ ఉజ్వల భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. ఇది అంతిమంగా దేశ ఆర్థిక ప్రగతి పైన సైతం కోలుకోలేని విధంగా పెను ప్రభావం చూపుతోందని, అందుకే యువతను ఈ వ్యసనాలకు వీలైనంత దూరంగా ఉంచడమే ధ్యేయంగా బ్రహ్మకుమారీస్ ఈ ఉద్యమాన్ని భుజానికెత్తుకుందని స్పష్టం చేశారు.

**వికసిత్ భారత్ సాధనలో భాగస్వాములు కావాలె..**

భారత ప్రధాన మంత్రి ఆశయాలకు అనుగుణంగా 'వికసిత్ భారత్' సాధనలో భాగంగా ప్రారంభమైన ఈ ప్రజా ఉద్యమంలో సమాజంలోని అన్ని వర్గాలూ భాగస్వాములు కావాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవల్ పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజాప్రతినిధులు సైతం బాధ్యతగా ఈ ప్రచారంలో ముందుకు రావాలన్నారు. ఒక వ్యక్తి తీసుకునే మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞ అనేది కేవలం ఆ వ్యక్తికే పరిమితం కాకుండా, అతని కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని మరియు యావత్ దేశాన్ని ప్రభావితం చేసే అద్భుత శక్తిని కలిగి ఉంటుందని ఆయన వెల్లడించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఉజ్వల భవిష్యత్తు, ఆర్థిక వృద్ధి,సత్సంబంధాలతో కూడిన సానుకూల జీవనశైలి లభించాలంటే మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండటమే ఏకైక మార్గమని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సిస్టర్ ఉమ ఉద్ఘాటించారు. కార్యక్రమం ముగింపులో సిస్టర్ సాక్షి సమక్షంలో హాజరైన వారందరితో మాదకద్రవ్యాలకు సంపూర్ణంగా దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

# ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**విధి నిర్వహణలో ఉన్న జె. సాయికుమార్ బలవన్మరణం**

**ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసుల దర్యాప్తు**

**పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన**

హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్ ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. మృతుడిని 2024 బ్యాచ్‌కు చెందిన జె. సాయి కుమార్‌గా గుర్తించారు. అసలు ఏం జరిగింది? ఎలా జరిగింది? పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం... సాయి కుమార్ ప్రస్తుతం ఈ-కాప్స్ విధుల్లో భాగంగా ఎల్‌బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్‌గా పనిచేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో, విధుల్లో ఉన్న ఆయన కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో బలవన్మరణానికి పాల్పడ్డన్నారు.

అయితే, ఈ విషయాన్ని గమనించిన తోటి సిబ్బంది వెంటనే ఆయన్ను సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

కర్మన్‌ఘట్‌లో తన స్నేహితులతో కలిసి గదిలో నివసిస్తున్న సాయి కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇక, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అంతకుముందు మరోవైపు, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషాద ఘటనతో పోలీస్ శాఖలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# రాయదుర్గంలో భూదోపిడీని అడ్డుకుంటాం

**రూ. 1700 కోట్ల విలువైన భూమి బినామీ సంస్థలకు కట్టబెట్టిండ్రు?: దాసోజు ధ్వజం**

హైదరాబాద్, మనం ప్రతినిధి : రేవంత్ పాలనలో రాయదుర్గంలో జరుగుతున్న ఈ భూ దోపిడీని ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. అయితే, ఈ కబ్జాలపై తాము గవర్నర్, సీఐడీ, సీబీఐ దగ్గరికి పోతామని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాయదుర్గం మల్కం చెరువు ఎదురుగా నిర్మిస్తున్న పీఎం ఏక్తా యూనిటీ మాల్ నిర్మాణ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు.

రాయదుర్గంలో రూ.1700 కోట్ల విలువైన 7 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి పీఎం ఏక్తా మాల్ నిర్మాణం పేరుతో తన బినామీ సంస్థలకు ఎలాంటి టెండర్లు లేకుండా కట్టబెట్టారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎంత పెద్ద నేరస్థుడో ఆయనకి కొమ్ము కాస్తున్న అధికారులు కూడా అంతే నేరస్థులు. ఈ ప్రాజెక్టు కోసం గవర్నమెంట్ రూ.200 కోట్లు లోన్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ వాళ్లకు కళ్లే కనబడటం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బినామీ కంపెనీని నడుపుతున్నది ఐఏఎస్ జయేష్ రంజన్, ఐఎఫ్ఎస్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి అని ఆరోపించారు. ఇష్టం వచ్చినట్లు దొంగ అగ్రిమెంట్లు, టెండర్లు చేసి వేల కోట్ల రూపాయలు పందికొక్కుల లాగా దోచుకుని తింటాము అంటే కర్రు కాల్చి అధికారులకు కూడా వాతలు పెడతామన్నారు.

# తిన్నింటి వాసాలు లెక్కపెట్టకు

## పదేండ్లు కేసీఆర్ కాళ్లు మొక్కింది ఎవరు?

## మంత్రి పొంగులేటిపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఫైర్



హైదరాబాద్, మనం ప్రతినిధి : మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉండి.. కేసీఆర్, కేటీఆర్ కాళ్లు మొక్కింది పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాదా..? పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అన్ని కాంట్రాక్టులు తీసుకొని ఎంజాయ్ చేసింది మీరు కాదా..? అంటు పొంగులేటిపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నిలదీస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇటీవల కమలాపూర్‌లో గత బీఆర్ఎస్ చేసిన అప్పుల గురించి అబద్ధాలు చెప్తున్నారంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై పాడి స్టేజీపైనే ఫైర్ అయిన సంగతి తెలిసిందే.

ఇక, ఈ విషయంపై తెలంగాణ భవన్‌లో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ రూ.8 లక్షల కోట్లు అప్పులు చేసి తెలంగాణ మీద ఆర్థిక భారం వేశాడని అబద్ధాలు చెప్పే ప్రయత్నం మంత్రి పొంగులేటి చేస్తే మీరు తప్పు చెబుతున్నరు సార్.. ఇది కాంగ్రెస్ పార్టీ మీటింగ్ కాదు? ఆఫీషియల్ మీటింగ్.. మీరు నిజాలు చెప్పండని అని నిలదీశానన్నారు. అయితే, ఓ మంత్రిగా మీరు సిగ్గు లేకుండా అబద్ధాలు చెప్పొచ్చా.. అని హితవు పలికారు. ఇవాళ మేం చెప్పిన లెక్క కాదు కదా.. కేంద్రమంత్రి, బీజేపీకి సంబంధించిన ఎంపీ రఘునందన్ రావు అసలు తెలంగాణ ఎంత అప్పులున్నాయని పార్లమెంట్‌లో ప్రశ్నించినప్పుడు.. కేవలం రూ. 2.85 లక్షల కోట్లేనని నాటి కేంద్ర ప్రభుత్వమే చెప్పిందని గుర్తు చేశారు. మరి ఇప్పుడు సిగ్గు లేకుండా అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేయొద్దన్నారు. అయితే, ఇట్లాంటి అబద్ధాలు చెప్పొద్దని శ్రీనివాస్ రెడ్డిని కోపమెందుకని నిలదీశారు. అందరూ ఎమ్మెల్యేలల్లాగా కౌశిక్ రెడ్డి భయపడేటోడు కాదన్నారు.

తాను కేసీఆర్ దగ్గర ట్రైన్ అయిన శిష్యుడిని అని గుర్తు పెట్టుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్‌లో కేసీఆర్, కేటీఆర్ కాళ్లు మొక్కి, అన్ని కాంట్రాక్టులు తీసుకొని ఎంజాయ్ చేసిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంత పెద్దోడు అవడానికి.. ఆయన లేకుంటే మీ గతి ఏంటి..? అన్నం పెట్టిన వాళ్లనే మళ్లీ ఇవాళ తిడుతున్నవ్?... ఇకనైనా ఆయన ఉప్పు తిన్న విశ్వాసంతో తిన్నింటి వాసాలు లెక్కపెట్టవద్దని పొంగులేటికి పాడి సూచించారు.

హస్తం పార్టీలో అసలు కాంగ్రెస్ నేతలను పక్కనపెట్టి, దొంగ కాంగ్రెస్ నేతలే అడ్డదిడ్డంగా నోటికొచ్చిన అబద్ధాలన్ని మాట్లాడుతున్నారని పాడి తీవ్రంగా ఫైర్ అయ్యారు. ఇక, ఈ ఇష్యూ ఇంతటి ఇంతటితో అగుతుందా? లేక ఈ ఇరువురి వార్ తెలంగాణలో మరో ట్విస్ట్ తీసుకొనుందా? అన్నది వేచి చూడాలి మరి.

# టెసారాక్ట్ ఎట్ 'అనుముల హబ్స్'

- మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్' అనుముల హబ్' కడుతున్నడు
- మంత్రి శ్రీధర్ బాబు కామెంట్స్‌పై మండిపడ్డ కేటీఆర్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెసారాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఇదే అంశంపై బుధవారం ట్విట్టర్ వేదికగా కేటీఆర్ స్పందించారు. 'తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి' అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు.

తన సోదరుడు అయినందునే.. కేవలం, రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు.

టెసారాక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెసారాక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

## పునరుద్ధరిస్తాను

మా పెరటిలో కుల
విషవృక్షం ఏపుగా ఎదిగింది.

చుట్టూ ఉన్న ప్రేమవృక్షాల్ని
పెకిలించివేస్తోంది.

అది గాలి వీచినప్పుడల్లా
నాకు ఊపిరాడదు!

అహం కొమ్మలై విస్తరిస్తూ
దుఃఖాన్ని మొలిపిస్తోంది.

హృదయానికి గాయం చేస్తోంది!
నా కోమలత్వాన్ని మాయం చేస్తోంది.

తలవంచితే ఆ గాలి
బంధాలను తెంపేస్తోంది.

నన్ను శూన్యానికి నెట్టేస్తోంది!
ఎదురించి నిలబడతాను.

దారితప్పిన మానవత్వాన్ని
పునరుద్ధరిస్తాను!

పోరాటం ఏదైనా ముగింప
దుఃఖం కాకూడదు.

**- పద్మజా రామకృష్ణ.పి**
9491830278

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# బయో ఫ్యూయెల్‌కు కరువైన ప్రోత్సాహం

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్ధాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది.

మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైంది.

పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి.

శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది.

కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్లో కలిపి డిజిల్ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క



కార్బ్యురేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌నువాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ఓఇవద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడు తుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడు తుంది.

భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది.

బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి.

గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు.

నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది.

స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది.

స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

**- రామకిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ముదిమి వయస్సులో జీవన విధానం మార్చుకోవాలి



ప్రతి మనిషి జీవితంలో వృద్ధాప్యం అనేది తప్పనిసరిగా వచ్చే దశ. వృద్ధాప్యాన్ని ఎలా స్వీకరించాలి, ఎలా ఆరోగ్యంగా మరియు ప్రశాంతంగా జీవించాలి అనేది మాత్రం మీ చేతుల్లోనే ఉంటుంది. యుక్త వయస్సులో జీవితం తపనతో సాగుతుంది. చదువు, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబం, ఆస్తి, పిల్లల భవిష్యత్తు, ఆర్థిక స్థిరత్వం ఇలా ఎన్నో లక్ష్యాల కోసం మనిషి నిరంతరం పరుగులు తీస్తుంటాడు. శరీరంలో శక్తి ఎక్కువగా ఉంటుంది. సమయం అంతా మీ చేతిలోనే ఉందనే భావన ఉంటుంది. కానీ మధ్యవయస్సుకు చేరుకునే సరికి జీవితాన్ని మరో కోణంలో చూడటం ప్రారంభమవుతుంది. అప్పటివరకు సంపాదన, బాధ్యతలు, భవిష్యత్తు గురించి ఆలోచించిన వ్యక్తి, ఇక ఆరోగ్యం, ప్రశాంతత, కుటుంబంతో గడిపే సమయం, తనకు తాను కేటాయించే సమయం గురించి కూడా ఆలోచించాలి. వృద్ధాప్యం అంటే బలహీనత కాదు. వయస్సు పెరిగినంత మాత్రాన మనిషి విలువ తగ్గిపోదు. అనుభవం పెరుగుతుంది. జీవితాన్ని చూసిన విధానం మారుతుంది. ఎన్నో పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవం వల్ల సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. యువతకు శక్తి ఉంటే, వృద్ధులకు అనుభవం ఉంటుంది. వృద్ధాప్యాన్ని ఒక భారంగా కాకుండా జీవితంలో మరో అందమైన దశగా చూడాలి. వృద్ధాప్యం వచ్చిన తర్వాత జీవనశైలిని మార్చుకోవడం కంటే, మధ్యవయస్సులోనే కొన్ని అలవాట్లను ఏర్పరచుకోవడం మంచిది. రోజువారీ జీవితంలో క్రమశిక్షణ, సమయానికి నిద్ర, సమతుల్యమైన ఆహారం, తగినంత శారీరక కదలిక, ఒత్తిడిని తగ్గించుకోవడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అలవాట్లు ముందుగానే ఏర్పడితే వృద్ధాప్యంలో జీవితం కొంత సులభంగా ఉంటుంది. మీ శరీరం మీకు జీవితాంతం తోడుగా ఉండే సాధనం. అందుకే దాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వయస్సు పెరిగే



కొద్దీ శరీర అవసరాలు మారుతాయి. ఆహారంలో కూడా సరైన మార్పులు అవసరం. తాజా కూరగాయలు, పండ్లు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు, అవసరమైన ప్రోటీన్, తగినంత నీరు వంటి పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం మంచిది. అధిక ఉప్పు, అధిక చక్కెర, అతిగా నూనెతో తయారైన ఆహారం మరియు అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం ఉపయోగకరం. అవసరమైతే వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సలహా తీసుకోవాలి. వృద్ధాప్యంలో ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం అలవాటుగా మారకూడదు. శరీరానికి తగినంత కదలిక ఉండాలి. వైద్యుల సూచనకు అనుగుణంగా నడక, తేలికపాటి వ్యాయామం, స్ట్రెచింగ్ లేదా ఇతర అనుకూలమైన శారీరక కార్య కలాపాలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. శరీరం కదులుతూ ఉంటే మనసు కూడా చురుకుగా ఉండే అవకాశం ఉంటుంది. వయస్సు పెరిగిన తర్వాత కొత్త వ్యాయామాలను ప్రారంభించకుండా, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా నిపుణుల సలహాతో కొనసాగించడం మంచిది. మానసిక ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోవాలి వృద్ధాప్యంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా చాలా ముఖ్యం. పిల్లలు తమ జీవితాల్లో బిజీగా ఉండవచ్చు. బంధువులతో కలిసే సమయం తగ్గవచ్చు. ఉద్యోగ విరమణ తర్వాత రోజువారీ జీవితంలో ఖాళీ సమయం పెరగవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఒంటరితనం అనిపించకుండా మీకు నచ్చిన పనుల్లో మిమ్మల్ని, మీరు నిమగ్నం చేసుకోవాలి. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, తోటపని చేయడం, ఆధ్యాత్మిక లేదా సాంస్క ృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం, స్నేహితులతో మాట్లాడటం, సామాజిక సేవ చేయడం వంటి కార్యకలాపాలు జీవితానికి ఉత్సాహాన్ని ఇస్తాయి. మధ్య వయస్సులోనే వృద్ధాప్యంలో వచ్చే పరిస్థితులను అంచనా వేసుకొని ఆర్థిక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడం చాలా అవసరం. అవసరమైన పొదుపు, బీమా, పదవీ విరమణ తర్వాత వచ్చే ఆదాయం, రోజువారీ ఖర్చులు వంటి అంశాలను ప్రణాళిక చేసుకోవాలి. పిల్లలపై పూర్తిగా ఆధారపడకుండా, సాధ్యమైనంత వరకు తమ అవసరాలకు తాము సమకూర్చుకునే విధంగా ఆర్థిక ప్రణాళిక ఉండటం ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. పిల్లలపై అంచనాలను తగ్గించు కోవాలి. పిల్లలు ఇలా చేయాలి, వాళ్లు ప్రతిరోజూ మనతో ఉండాలి, మన మాట వినాలి అనే అంచనాలు ఎక్కువైతే నిరాశ కూడా ఎక్కువవుతుంది. పిల్లలు తమ జీవితాల్లో, ఉద్యోగాల్లో, కుటుంబ బాధ్యతల్లో బిజీగా ఉంటారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుంటూ, ప్రేమను మాత్రం కొనసాగిస్తూ, అవసరానికి మించి ఆధారపడకుండా ఉండటం మంచిది. ప్రేమ ఉండాలి కానీ అధిక అంచనాలు ఉండకూడదు. ఒంటరిగా ఉండటం వేరు, ఒంటరితనం వేరు వృద్ధాప్యంలో కొంత సమయం ఒంటరిగా గడపడం తప్పు కాదు. కానీ ఒంటరితనం మనస్సును కుంగదీయకుండా చూసుకోవాలి. స్నేహితులతో మాట్లాడటం, బంధువులను కలవడం, పరిచయస్తులతో సంబంధాలు కొనసాగించడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మనసుకు ఉత్సాహం వస్తుంది. మనిషి వయస్సు పెరిగినా అతనికి స్నేహం, ఆప్యాయత, గౌరవం అవసరం అలాగే ఉంటుంది. ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో వచ్చే మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సూచనలు, అవసరమైన మందులు మరియు ఫాలోఅప్లను క్రమంగా పాటించడం మంచిది. శరీరంలో కొత్తగా కనిపించే లేదా కొనసాగుతున్న సమస్యల గురించి వైద్యుడిని సంప్రదించడం అవసరం. వృద్ధాప్యంలో గత జ్ఞాపకాలు ఎక్కువగా గుర్తుకు వస్తాయి. చేసిన తప్పులు, కోల్పోయిన అవకాశాలు, ఎదురైన అవమానాలు, పాత గొడవలు మనసులో తిరుగుతుంటాయి. గతం నుంచి పాఠాలు తీసుకోవాలి కానీ గతంలోనే జీవించకూడదు. అందుకే మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా, ఆనందంగా, ఇతరులకు ఉపయోగ పడేలా గడపడం ఉత్తమం. ఎవరికైనా ఉపయోగపడేలా జీవిం చాలి వృద్ధాప్యం అంటే విశ్రాంతి మాత్రమే కాదు. మీకు తెలిసిన జ్ఞానాన్ని, అనుభవాన్ని వస్తున్న తరానికి అందించే సమయం కూడా. చిన్నవారికి సలహాలు ఇవ్వడం, వారికి మార్గదర్శకత్వం చేయడం, సామాజిక సేవలో పాల్గొనడం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి పనులు జీవితానికి ఒక అర్థాన్ని ఇస్తాయి. వృద్ధాప్యానికి ముందే సిద్ధం కావాలి వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఇలా ఉండాలి అని ఆలోచించడం కంటే, మధ్యవయస్సులోనే ఆ దశకు సిద్ధం కావడం మంచిది. ఆరోగ్యం కోసం క్రమశిక్షణ, ఆర్థిక భద్రత కోసం పొదుపు, మనశ్శాంతి కోసం మంచి సంబంధాలు, చురుకుదనం కోసం మంచి అలవాట్లు, సంతోషం కోసం సంతృప్తి, గౌరవం కోసం మంచి ప్రవర్తన ఇవి వృద్ధాప్యాన్ని సులభతరం చేసే ముఖ్యమైన అంశాలు.వృద్ధాప్యం జీవితానికి ముగింపు కాదు. అది జీవితాన్ని నెమ్మదిగా ఆస్వాదించే మరో దశ. జీవితం ఎంతకాలం అనేది ఎవ్వరి చేతుల్లో ఉండదు. కానీ ఉన్నంతకాలం ఎలా జీవించాలి అనేది మాత్రం మీ చేతుల్లోనే ఉంటుంది. వృద్ధాప్యాన్ని ఎదురు చూడకండి. వృద్ధాప్యానికి ఇప్పటి నుంచే సిద్ధం అవ్వండి, వచ్చిన వృద్ధాప్యాన్నీ ఆనందంగా, ప్రశాంతంగా కొనసాగించండి.

**- వై. సంజీవ కుమార్**
9393613555

## బొడ్రాయమ్మ..!

వానమ్మ యాడబోయనో
చినుకు చుక్క లేకపాయే
ఊరు చినబోయి కూకుంది
వాడలో మనిషి జాడే కరువాయే
వాన కోసం కప్పల పెళ్లి
గంగమ్మకు ముక్కుబడి
తువాలి నడుంలో చిక్కిలించి
సెలకలెంబడి పరుగుడాయే

బొడ్రాయమ్మకు నీళ్ళోసి
చెరువు గట్టుకు టెంకాయ కొట్టి
పొలిమేర తిరిగి రావడమాయే
గూట్లో గువ్వలెగిరిపాయే
పశువుల మేపు కట్టమైపాయే
కాళ్ళిరిగిన సంసారం
ఆడనే కూలబడి ఏడ్చుడాయే

తప్పెట్ల భజనలతో
ఊరూరా తిరుగుడే పనైపాయే
గాలికెగిరిన కంప
గోచీకి తగిలినట్టాయే
మూటముళ్ళె సర్ది ఏగుడాయే
కంట్లో ఎట్టుకోడాన్కి
ఒక్క చుక్కైనా నీరు దొరక్కపాయే
గడ్డపార నాగలి మూలకేగి
ఎక్కెక్కి ఏడ్చుకునే పనైపోయే
కరువొచ్చి కాళ్ళకు అడ్డుపడతాంటే
బువ్వకు దిగులొచ్చి
కుండలోనే పాచిపోవుడాయే
బొడ్రాయమ్మకు నిండా నీళ్ళోసి
పైకి ఎగచూడ్డమే గతైపాయే
గ్రహచారం గోడెక్కి కూయబట్టే
ఆచారం వీధులెంట తిరగబట్టే

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

# మరణాన్ని జయించే ..అవయవ దానం



అనంతమైన కాలగర్భంలో ఏ ప్రాణికైనా పుట్టుక, మరణం సహజం. అయితే, భౌతికంగా ఈ లోకాన్ని విడిచిపెట్టిన తర్వాత కూడా పది కాలాల పాటు జీవించే అద్భుతమైన వరం కేవలం మానవుడికి మాత్రమే ఉంది. మరణించిన తర్వాత కూడా తోటి మనిషిలో ప్రాణమై నిలిచి, వారికి పునర్జన్మను ప్రసాదించే అత్యున్నత త్యాగమే 'అవయవ దానం'. ఇటువంటి ఉదాత్తమైన ఆలోచనను సమాజంలో నాటడానికే, ఆగస్టు 13న 'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలో, అవయవ దానం వెనుక ఉన్న ఆవశ్యకతను, దాని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన తరుణం ఆసన్నమైంది. సమాజంలో పేరుకుపోయిన అపోహల పొరలను చీల్చి, మరణించినా తోటివారికి పునర్జన్మను ప్రసాదించవచ్చనే నవ చైతన్యాన్ని తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

నేటి ఆధునిక కాలంలో జీవనశైలి వ్యాధులు, రోడ్డు ప్రమాదాల కారణంగా ఎంతోమంది అవయవాలు పాడైపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది రోగులు గుండె, కాలేయం, కిడ్నీల మార్పిడి కోసం ఆసుపత్రుల్లోని వెయిటింగ్ లిస్టులో రోజులు లెక్కబెడుతున్నారు. డిమాండ్‌కు, లభ్యమవుతున్న అవయవాలకు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా పెద్దది. సకాలంలో అవయవాలు దొరకక ఎందరో అభాగ్యులు మృత్యువాత పడుతున్నారు. నిరాశలో ఉన్న జీవితాలకు అవయవ దానం మాత్రమే ఏకైక సంజీవని.

ఒక ప్రాణం ఎనిమిది మందికి పునర్జన్మనిస్తుంది. అవయవ దానం చేయడం అంటే ప్రాణదానం చేయడమే. రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర అనారోగ్య కారణాల వల్ల వైద్య పరిభాషలో మెదడు నిర్జీవమైన (బ్రెయిన్ డెడ్) వ్యక్తుల నుంచి అవయవాలను సేకరించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అమర్చుతారు.

గుండె, కాలేయం, రెండు కిడ్నీలు, ఊపిరితిత్తులు, క్లోమం (ప్యాంక్రియాస్), చిన్నపేగు... ఇలా ఒక వ్యక్తి చేసే అవయవ దానం ద్వారా ఏకంగా ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. కార్నియా (కంటి పొరలు) దానం ద్వారా ఇద్దరు అంధులకు కంటి చూపునివ్వవచ్చు. చర్మం, ఎముకలు వంటి కణజాల దానం ద్వారా మరో 75 మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చు.

ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి, ఇన్ని కుటుంబాల్లో ఆనందపు సిరులు కురిపించి, ఎంతోమందికి పునర్జన్మను ప్రసాదించే నిజమైన దేవుడవు తాడు. అవయవ దానం పట్ల విద్యావంతుల్లో సైతం ఇంకా ఎన్నో అపోహలు, భయాలు నెలకొని ఉన్నాయి. దేహం వికృతం అవుతుందనే భయం. అవయవాలు తీసేస్తే మృతదేహం వికృతంగా మారుతుందేమోనని కుటుంబ సభ్యులు భయపడతారు. కానీ, అవయవ సేకరణ ఒక నిపుణులైన సర్జన్ల బృందం అత్యంత జాగ్రత్తగా, గౌరవప్రదంగా చేస్తుంది. శస్త్రచికిత్స తర్వాత మృతదేహం ఆకృతి ఏమాత్రం చెడిపోకుండా కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు.

అలాగే అవయవ దానానికి అంగీకరిస్తే, వైద్యులు రోగిని బతికించే ప్రయత్నం చేయరని కొందరు అపోహ పడుతుంటారు. ఇది ముమ్మాటికీ అవాస్తవం. ఒక వైద్యుడికి రోగి ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యం. రోగి మెదడు




పనితీరు పూర్తిగా ఆగిపోయి, ఇక బతికే అవకాశమే లేదని అత్యంత పారదర్శకమైన విధానంలో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక నిపుణుల కమిటీ నిర్ధారించిన తర్వాత (బ్రెయిన్ డెడ్) మాత్రమే అవయవ దానం అనే ప్రస్తావన వస్తుంది.

కొంతమంది మూఢ విశ్వాసాల వల్ల దేహాన్ని కోయడాన్ని అంగీకరించరు. కానీ, అన్నింటి సారాంశం ఒక్కటే. తోటి మనిషికి సాయపడటం.

ఒక మనిషి ప్రాణాన్ని కాపాడటానికి మించిన పుణ్యకార్యం లేదని అన్ని గ్రంథాలూ చెబుతు న్నాయి. ఈ వాస్తవాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇంకా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి. అవయవ దానాలు పెరగాలంటే ముందుగా వైద్య వ్యవస్థపై ప్రజల్లో పూర్తి నమ్మకం కలగాలి. అవయవాల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలి. సిఫార్సులు, ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా, సీనియారిటీ, రోగి అవసరం ఆధారంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 'జీవన్‌దాన్' లాంటి రిజిస్టర్ సంస్థ ద్వారా నిరుపేదలకు సైతం అవయవాలు దక్కేలా చూడాలి. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉంటారు. ఆ సమయంలో అవయవ దానం గొప్పతనాన్ని అత్యంత సున్నితంగా వివరించి ఒప్పించగలిగే కౌన్సెలర్ల వ్యవస్థ బలోపేతం కావాలి. అలాగే, దాతల కుటుంబాలను ప్రభుత్వాలు, సమాజం సముచితంగా గౌరవించాలి. వారి అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించడం, దాతల పేరిట స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయడం లాంటి చర్యలు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచి సామాన్యుల్లో గొప్ప స్ఫూర్తిని రగిలిస్తాయి.

అలాగే అవయవ దానం చేయాలన్న సత్సంకల్పం ఉన్నా, చాలామందిని వెనక్కి లాగుతున్న ప్రధాన అడ్డంకి ఉంది. 'శరీర భాగాలను దానం చేస్తే దేహం అసంపూర్ణంగా మారుతుందని, తద్వారా పునర్జన్మ ఉండదని లేదా మోక్షం రాదని' భయపడటం. ఇది కేవలం అవగాహన లోపం వల్ల పుట్టుకొచ్చిన ఒక నిరాధారమైన అపోహ మాత్రమే. ఆధ్యాత్మిక దృష్టితో చూసినా, సనాతన ధర్మం ప్రకారం ఆలోచించినా ఈ భయాల్లో ఏమాత్రం వాస్తవం లేదు.

మరణం తర్వాత ఎలాగూ ఈ దేహాన్ని మట్టిలో పాతిపెడతాం లేదా మంటల్లో కాల్చి బూడిద చేస్తాం. పంచభూతాల్లో కలిసిపోయే ఈ నిరుపయోగమైన దేహం మరొకరి శరీరంలోకి వెళ్లి వారికి కొత్త జీవితాన్ని ఇస్తే, అది ప్రకృతికి మనం అర్పించే అతిపెద్ద కృతజ్ఞత అవుతుంది. అవయవ దానం చేయడం అభాగ్యు లకు ప్రాణదానం చేసిన మహా పుణ్యం ఆ దాతకు దక్కు తుంది. ఈ నిస్వార్థమైన మహాకార్యం వల్ల ఆత్మకు ఎలాంటి ప్రతికూలతా ఉండదు సరికదా, ఆ త్యాగఫలం ఆత్మను మరింత పవిత్రం చేసి అత్యున్నత లోకాలకు చేరుస్తుంది. నిజానికి, అవయవ దానం చేసేవారికి పునర్జన్మ ఉండకపోవడం కాదు, మృత్యువు అంచున ఉన్న ఎందరికో 'పునర్జన్మ' ప్రసాదించే దేవుళ్లుగా వారు చరిత్రలో చిరంజీవులై నిలిచిపోతారు. మరణం తర్వాతా జీవించే అద్భుత అవకాశం ఒక మనిషికి మాత్రమే ఉంది.

ఒకరి మరణం ఆ కుటుంబానికి తీరని శోకం. కానీ ఆ శోకంలోంచి ఎందరికో ఆనందాన్ని ఇవ్వగలిగే విశాల దృక్పథం అవయవ దానం. మనం చనిపోయిన తర్వాత మట్టిలో కలిసిపోయే లేదా అగ్నికి ఆహుతయ్యే మన దేహం, ఇంకొకరిలో ప్రాణమై నిలిస్తే అంతకంటే గొప్ప పుణ్యకార్యం మరొకటి లేదు. మనం లేకపోయినా మన కళ్ళతో వారు ఈ అందమైన ప్రపంచాన్ని చూస్తారు. మన గుండె వారిలో 'లబ్ డబ్ లబ్ డబ్' అంటూ చప్పుడు చేస్తుంది. మన ఊపిరితిత్తులు వారిలో శ్వాసిస్తాయి.

అంటే అవయవ దానం చేసినవారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఎంతోమందికి పునర్జన్మనిచ్చి చిరంజీవులుగా మన చుట్టూ తిరుగుతూనే ఉంటారు. అవయవ దానం కేవలం శరీర భాగాలను ఇవ్వడం కాదు, జీవితం మీద ఆశ కోల్పోయిన వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించడం. భవిష్యత్తుపై భరోసానివ్వడం. అదొక సజీవ సాక్ష్యం. ఈ అవయవ దాన దినోత్సవం రోజున పౌరులంతా ఈ గొప్ప యజ్ఞంలో భాగస్వాములవుదాం. అవయవ దానానికి ప్రతిజ్ఞ చేద్దాం, మరణాన్ని జయించి మృత్యుంజయులుగా నిలుద్దాం.

**- పింగళి భాగ్యలక్ష్మి**
9704725609

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు



తాడ్వాయి, ఆగస్టు 12, మనం ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 16వ తేదీన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ సందర్శన, గిరిజన సంస్కృతి సాంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతల దర్శనానికి ప్రణాళిక బద్ధంగా అన్ని పనులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను, హెలప్యాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్ లను జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలిప్యాడ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రత, వాహనాల రాకపోకలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణంలో కలియ తిరుగుతూ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై గుత్తేదారుతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనులు పూర్తయిన వెంటనే మిగిలిపోయిన గ్రానైట్ రాళ్లు, నిర్మాణ వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత గుత్తేదారునకు ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించే సందర్భంగా ఆశీర్వచనాలు, శేషవస్త్రాల సమర్పణ, మొక్కులు చెల్లించడం తదితర కార్యక్రమాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పక్కాగా సిద్ధం చేసుకోవాలని ఆలయ ఈవోను కలెక్టర్ ఆదేశించారు. వనదేవతల ప్రాంగణం చుట్టుపక్కల గార్డెనింగ్, ల్యాండ్స్కేపింగ్ చేపట్టి మొక్కలు నాటాలని, ఆలయ ప్రాంగణంలో గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసిన భారీ పీటీ బీమ్స్ను పూలతో ఆకర్షణీయంగా సుందరీకరించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఆలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా కనిపించేలా సుందరీకరణ పనులను పూర్తి పూర్తి చేయాలన్నారు. వనదేవతల దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించనున్నందున అవసరమైన ఏర్పాట్లతో సిద్ధం చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అన్ని చోట్ల పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, వాహనాల నియంత్రణ, ప్రోటోకాల్, రాకపోకలు, ఆలయ పరిసరాల్లో భద్రత తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, ఆలయ ఈవో వీరస్వామి, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సింగ్, గుత్తేదారులు ఆదినారాయణ, తాడ్వాయి తహసిల్దార్ సురేష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేర పరిశోధనకు నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తాయి




- సిపి రష్మీ పెరుమాళ్

వర్గల్ ఆగస్టు 12(మనం న్యూస్): నేర పరిశోధనలకు నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపిఎస్ పేర్కొన్నారు. సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా వర్గల్ మండలం గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం గ్రామంలో స్నేహ పౌల్ట్రీ ఫార్మ్ యజమాన్యం ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన16 సీసీ కెమెరాలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రతను పటిష్టం చేయడం నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచడం లక్ష్యంగా సురక్ష నేత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేర నియంత్రణకు ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నివారణ, నిందితుల ను గుర్తించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న సిద్దిపేట సురక్ష మిత్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు వివిధ గ్రామాల సర్పంచులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యతపై అవగాహన



కాటారం, ఆగస్టు 12 మనం న్యూస్ : మండలంలోని గంగారం మోడల్ స్కూల్లో రెవల్యూషనరీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాడు విద్యార్థులకు దేశభక్తి, ఐక్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై శ్రీనివాస్, ఎస్సై-2 మహేష్, ప్రిన్సిపాల్ గోవర్ధన్, నిర్వాహకుడు శ్రీకాంత్ హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తిరంగ జెండా దేశ సమగ్రత, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ భారతీయత ప్రజలందరినీ ఏకం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యత, సోదరభావ ంతో మెలుగుతూ దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి ఉన్నత పాఠశాలలో షీ టీం అవగాహన సదస్సు

భూపాలపల్లి ఆగస్టు 12 మనం ప్రతినిధి: భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు భరోసా,షీ టీం వారి ఆధ్వర్యంలో సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై స్వప్న కుమారి విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలు, విద్యార్థినుల భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్కు స్పందించవద్దని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలు లేదా విద్యార్థినుల భద్రతకు సంబంధించిన సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ఫ్రీ నంబర్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని, షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తల్లిదండ్రులు తమ చదువు కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్సై స్వప్న కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, భరోసా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాదేవపూర్‌లో సామాజిక తనిఖీ




మహాదేవపూర్ ఆగస్టు 12 మనం న్యూస్ః మహాదేవపూర్ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించుటకు తనిఖీ బృందం ఈరోజు రావడం జరిగింది. గత ఆర్థిక సంవత్సరం మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 2,09,66,433 కూలీల వేతనాలు, 1,39,14,105 మెటీరియల్ చెల్లింపులు మొత్తంగా 3,48,80,538 రూపాయలు ఖర్చు చేసిన మొత్తమునకు గ్రామపంచాయతీలలో ఆడిట్ బృందం వారం రోజులపాటు షెడ్యూల్ ప్రకారం పర్యటించి ఇట్టి ఖర్చులకు సంబంధించి పని స్థలములను ప్రత్యక్షంగా సందర్శించి తనిఖీ చేపట్టనున్నారు. ఈరోజు సామాజిక తనిఖీ బృందము, గ్రామపంచాయతీ ఫీల్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులతో ఈరోజు మండల ప్రజా పరిషత్ కార్యాలయం మహదేవపూర్ లో ఎంపీడీవో ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ మీటింగ్ చేపట్టడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్ఆర్పీలు మాట్లాడుతూ గ్రామపంచాయతీని తనిఖీ బృందం సందర్శించినప్పుడు అట్టి గ్రామపంచాయతీలో చేపట్టిన పనులను ఫీల్ అసిస్టెంట్ లేదా పంచాయతీ కార్యదర్శి పని చేపట్టిన స్థలములను తనిఖీ బృందములకు చూపించాలని ఆడిట్ పూర్తి అయ్యేంతవరకు గ్రామంలో అందుబాటులో ఉండి సహకరించాలని కోరినారు. అంతేకాకుండా ఈ సంవత్సరం మొట్టమొదటిసారిగా జిల్లాలో మహదేవపూర్ మండలం ని పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి చేయూత పెన్షన్లను కూడా తనకి నిర్వహించనున్నారు. ఇట్టి చేయుత పెన్షన్ల తనిఖీలో పెన్షనర్ దారుని ప్రత్యక్షంగా కలిసి పెన్షన్ అందుతున్న తీరు, పెన్షన్ పొందుటలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా వంటి వివరములను అడిగి తెలుసుకోనున్నారు. ఇట్టి సామాజిక తనిఖీ ఎస్ఆర్పిలు రవి యాదవ్, నాగరాజు ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ తెలిపినారు. ఇట్టి సమావేశంలో ఎస్ఆర్పీల తో పాటు ఉపాధి హామీ ఇన్చార్జి ఏపీఓ శ్రీనివాస్, సాంకేతిక సహాయకులు కంప్యూటర్ ఆపరేటర్లు, ఆయా గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్ అసిస్టెంట్లు, ఆడిట్ బృందం డిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు వాహన తనిఖీలు



మహాదేవపూర్ ఆగస్టు 12 మనం న్యూస్: అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బొమ్మాపూర్ క్రాస్రోడ్ వద్ద బుధవారం నాడు మహాదేవ్పూర్ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, సురక్షితంగా ప్రయాణించడం గురించి అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్పూర్ సిఐ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం. సాంబమూర్తి, ఏ ఎం వి ఐ సుందర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారు లపై ఫైన్లు విధించగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ద్విచక్ర వాహనాలు, బొలెరో వాహన్ని సీజ్ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి, వాహనాలను జాగ్రత్తగా నడపాలని పోలీసులు సూచించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలిపారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం



- అమావాస్య అన్నప్రసాదం పంపిణీ

నేరేడుచర్ల ఆగస్టు 12 మనం న్యూస్.. అన్నం పరబ్రహ్మ స్వరూపం నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ ఆధ్వర్యంలో నెలకోసారి అమావాస్య రోజున అన్న ప్రసాదం పంపిణీ కొంతమంది పేదల ఆకలి తీరుస్తుంది. అమావాస్య సందర్భంగా బుధవారం సుమారు 600 మందికి బాటసారులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం దాదాపు 22 నెలల నుంచి ప్రతి అమావాస్య రోజున నిర్వహిస్తున్నారు. సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు రాచకొండ శ్రీనివాసరావు ఊట్కూరు నటరాజు. కందిబండ శ్రీనివాసరావు,ఉప్పల పుల్లయ్య. పోలిశెట్టి వెంకటేశ్వర్లు. జూలురి అశోక్. తడకమళ్ళ పరమేశం. భువనగిరి అంజయ్య. గుండా సత్యనారాయణ. గుంటూరు శ్రీనివాస్. మిట్టపల్లి దయాకర్ .గరిణె వెంకన్న. చందా కిషన్ .చెరుకు రాము. చారగుండ్ల వెంకటేశ్వర్లు. ఓరుగంటి గణేష్ .మిట్టపల్లి దయకరు, దెవర్శెట్టి వెంకటేశ్వర్లు .రాచకొండ రవి .రాచకొండ విజయ్. తాళ్లూరు శ్రీనివాస్.గజవెల్లి నరసింహారావు. కుక్కడపు శ్రీనివాస్,వెంపటి జానకిరామయ్య. గరిణె వాసు. పారేపల్లి అశోక్ .కుక్కండ్ల వెంకటేశ్వర్లు.బొడ్డు నాగేశ్వరరావు .కొత్తూరు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

# హెచ్ఐవీ-ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలి




- సరైన సమాచారాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయా లి
- జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ పిలుపు

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 12 (మనం బ్యూరో): బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ/ఎయిడ్స్పై నిర్వహించిన అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రారంభించారు. పాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్,బ్రేక్ ఫ్రీ పోస్టర్లను ఆవిష్కరించి, యువతకు హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... హెచ్ఐవీ/ఎయిడ్స్పై సరైన అవగాహనే నివారణకు మొదటి అడుగని తెలిపారు. వ్యాధిపై ఉన్న అపోహలు, భయాలను తొలగించి ప్రతి ఒక్కరికీ వాస్తవమైన సమాచారం చేరవేయాలన్నారు. హెచ్ఐవీపై అనుమానం ఉన్నవారు ఎలాంటి సంకోచం లేకుండా పరీక్షలు,కౌన్సెలింగ్ మరియు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిని వివక్షకు గురిచేయకుండా గౌరవం, మానవతా దృక్పథంతో చూడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న అవగాహన, పరీక్షలు, కౌన్సెలింగ్ మరియు చికిత్సా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా హెచ్ఐవీ నివారణపై సమాజంలో మరింత చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు. యువత స్వయంగా అవగాహన పొందడంతో పాటు ఇతరులకు కూడా సరైన సమాచారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. అవగాహన పెంచుదాం - అపోహలను తొలగిద్దాం - హెచ్ఐవీని నివారిద్దాం అని అదనపు కలెక్టర్ సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,జిల్లా వైద్య శాఖ అధికారి సంధ్య కిరణ్మయి, వైద్య సిబ్బంది, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.



# బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ఆగస్టు 12(మనం ప్రతినిధి)ః ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయం లో బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్స్పాట్ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్దిసేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు.ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎమర్జెన్సీ-112 కాల్స్కు తక్షణం స్పందించాలి: కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్-112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు మరియు సాక్షుల నుంచి సమాచారం సేకరించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ఆస్తి సంబంధిత నేరస్తులు, దొంగసొత్తు కొనుగోలు చేసే వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు.కమ్యూనిటీ పోలీసింగ్కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్ మరియు పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. సమావేశంలో డి.సి.ఆర్. బి. డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసుల దాడి



## మెదక్ మాజీ డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డితో పాటు 7 అరెస్ట్

మేడ్చల్, ఆగస్టు 12( మనంప్రతినిధి)ః మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పి.యస్ పరిధి కొంపల్లిలో పేకాట స్థావరంపై ఎస్ఓటి పోలీసులు దాడి చేసి గుట్టు రట్టు చేశారు.పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అపర్ణ సరె నిటీ అపార్ట్మెంట్ పై దాడులు చేసి 8 మంది పేకాటరాయలను అదుపులో తీసుకు న్నారు వీరిలో మాజీ మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి తో పాటు రియల టర్స్ ఉన్నారు. పేకాటాడుతూ దేవేందర్ రెడ్డి పోలీసులకు దొరకడం ఇది రెండోసారి, మాజీ డీసీసీబీ చైర్మన్తో పాటు రమేష్ (45) మోహన్ (56) కి. శ్రీనివాస్ (56) విక్రంరెడ్డి (46)స్. శ్రీనివాస్ (53) గొల్లపలి భాస్కర్(59) రాజు (26) డ్రైవింగ్ సహా మొత్తం 8 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్ చేసిన పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల రైడ్లో రూ. 3.28లక్షల నగదు, నగదు లెక్కించే మిషన్, పేక కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలి

- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి పరిసరాలను ఆకర్షణీయంగా సుందరీకరించాలి
- జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు



ములుగు, ఆగస్టు 12, మనం ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16వ తేదీన ములుగు జిల్లా పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పరిసరాలను ఆకర్షణీయంగా సుందరీకరించాలని జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్తో కలిసి జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హెలిప్యాడ్ను, గట్టమ్మ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్ నిర్మాణం పనులను పరిశీలించి, గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ హెలిప్యాడ్ వద్ద చేపడుతున్న బారికేడింగ్, వీవీఐపీ వేచి ఉండే టెంట్, భద్రతా ఏర్పాట్లతో పాటు పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పైలాన్ నిర్మాణంతో పాటు ఇతర పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆకర్షణీయంగా సుందరీకరించాలని ఆదేశించారు. గట్టమ్మ దేవాలయ పరిసరాల పరిశుభ్రత, సుందరీకరణ, వాహనాల పార్కింగ్ స్థలాలు, భద్రత తదితర అంశాలను సమీక్షించి, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న పైలాన్ పనుల పురోగతిని పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం, స్టేట్ బోర్డ్ ఛాంబర్, జిల్లా కలెక్టర్ ఛాంబర్ తో పాటు వివిధ కార్యాలయ గదులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, డీఎస్పీ రవీందర్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ములుగు తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రిదశ వెంచర్ అక్రమాలకు 'అధికార' రక్షణా?



**జిల్లా అధికారుల మౌనం వెనుక మతలబేంటి?**
**అక్రమ నిర్మాణాలకు పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకు సహకారం ఉందా?**
**భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు..**
**వాస్తవం తేల్చాలని స్థానికుల డిమాండ్**
**ఫిర్యాదులు.. ఆరోపణలు.. అయినా స్పందన కరువు!**

**సంగారెడ్డి ప్రతినిధి/కంది ,మనం, ఆగస్టు 12:** గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతోంది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా అక్రమ నిర్మాణాలు కొనసాగడానికి పంచాయతీ కార్యదర్శి స్థాయి నుంచి జిల్లా పంచాయతీ అధికారుల వరకు కొందరి సహకారం ఉందని, ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? అవాస్తవం ఎంత? అన్నది ఇప్పటివరకు స్పష్టంగా తేలలేదు. దీంతో ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ స్థాయి అధికారులపై ఉండగా, అవి కొనసాగుతున్నాయంటే సంబంధిత అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి నుంచి ప్రారంభమై డీఎల్పీఓ, డీపీఓ స్థాయి వరకు అధికారుల సహకారం ఉందా? అక్రమ నిర్మాణాలు కొనసాగడానికి అధికారులు ఎందుకు అడ్డుకట్ట వేయడం లేదు? ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో ముడుపులు ముట్టాయన్న ఆరోపణల్లో నిజమెంత అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం.. అక్రమ నిర్మాణాలు కొనసాగడానికి ప్రధాన కారణం సంబంధిత అధికారుల నిర్లక్ష్యమేనా? లేక కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా సహకరిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే వాటికి సహకరిస్తున్నారని, ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శుల నుంచి మొదలుకొని జిల్లా పంచాయతీ అధికారుల వరకు భారీ ఎత్తున ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు అధికారుల నుంచి ఏదైనా సహకారం అందిందా? అధికారుల నిర్లక్ష్యం వెనుక మరేదైనా కారణం ఉందా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు. ఒకవైపు అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయినప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఫిర్యాదులు అందినా అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటి?




అధికారులకు సమాచారం లేదా? సమాచారం ఉంటే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఈ ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సి ఉంది. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఆరోపణలతో పాటు పంచాయతీ కార్యదర్శి స్థాయి నుంచి జిల్లా పంచాయతీ అధికారుల వరకు భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలపైనా సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ ద్వారా నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు. ఈ వ్యవహారం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? అన్న అంశాలపై జిల్లా యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.ఇకనైనా అధికారులు మౌనం వీడి సమగ్ర విచారణకు ఆదేశించి అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 16 వందల ఎకరాల దేవుడి భూములపై పట్టింపు లేదా?

**తుంకుంట జిహెచ్ఎంసి అధికారులపై అనుమానాలు**
**దేవుడి భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన నో యాక్షన్**
**అక్రమ నిర్మాణదారులకు తుంకుంట జిహెచ్ఎంసి అధికారుల అండ?**

**మేడ్చల్, ఆగస్టు 12( మనం జిల్లా ప్రతినిధి ):** మేడ్చల్ జిల్లా తుంకుంట పరిధిలోని దేవర యాంజాల్ లోని సీతారామ ఆలయ భూములు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ భూములను పరిరక్షించాల్సిన తూముకుంట జిహెచ్ఎంసి అధికారుల కు పట్టింపు లేకుండా పోతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీతారామ ఆలయ భూములు కబ్జాకు గురైన, అక్రమ నిర్మాణాలు చేపట్టిన సంబంధిత తుంకుంట జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగుతున్న వాటి జోలికి తూముకుంట జిహెచ్ఎంసి అధికారులు వెళ్లడం లేదని విమర్శలు ఉన్నాయి. వీరి అండదం డలతోనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. 1600 ఎకరాలలో ఎన్నో అక్రమ నిర్మాణాలు తూముకుంట జిహెచ్ఎంసి పరిధి దేవర యాంజల్ లో ఉన్న సీతారాముల స్వామి కి చెందిన 1600 ఎకరాలలో స్థలం ఉంది. ఈ స్థలం పై హైకోర్టులో కేసు సైతం నడుస్తుంది. ఈ వివాదం హైకోర్టులో ఉన్నప్పటికీ ఇందులోఎన్నో అక్రమ నిర్మాణాలు మాత్రం సాగుతున్నాయి. తూం కుంట జిహెచ్ఎంసి అధికారుల అండ స్థానిక ప్రజాప్రతినిధుల అండ ఉంటే చాలు ఇక్కడ ఎంత పెద్ద గోదాములు గాని అక్రమ కట్టడాలు



గాని నిర్మించుకోవచ్చని వాదనలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి . దీంతో సీతారాముల స్వామి ఆలయ భూముల లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమగ్ర విచారణ జరిగితే వాస్తవాలు బయటకు వస్తాయి దేవర యాంజల్ లోని సీతారామ స్వామికి చెందిన భూముల పై సమగ్ర విచారణ జరిగితే వాస్తవాలు బయటకు వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. భారీ ఎత్తున గోదాముల నిర్మాణం, భవన నిర్మాణాల బాగోతం బయటకు వస్తాయని , ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి సీతారాముల స్వామి భూములను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# అసైన్డ్ భూములకు ఫెన్సింగ్



- **రాయపోల్, కొత్తపల్లి సర్వేనెం265,729 భూముల కు వెంటనే అమలు చేయాలి**
- **జిల్లాలో మిగతా అన్ని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ కే హైమావతి**

**సిద్దిపేట, ఆగస్టు 12(మనంప్రతినిధి):** జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా, సర్వే నిర్వహించి హద్దులు పెట్టి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసిల్దార్ లను ఆదేశించారు. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని 265 సర్వే నెంబర్ లో గల 6 ఎకరాలు, రాయపోల్ మండల కేంద్రంలోని 729 సర్వే నంబర్ లో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాలను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా లో అన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాల రికార్డులను పరిశీలించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వం స్థలం ఎంత, ఎంత ఆక్రమణకు గురైంది పూర్తి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ప్రభుత్వ భూమి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటుచేసి చుట్టూ ఫెన్సింగ్ వెయ్యాలని తహసీల్దారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతానికి గురి కాకుండాచూడాలని, కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని తహశీల్దార్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఏ పథకం ప్రవేశపెట్టినా అలాగే మండలంలో తహసిల్దార్, పోలీస్, ఇతరత్ర భవన నిర్మాణాలకు సదరు సర్వే నంబర్ లలో అనువైన స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, తహసిల్దార్ కృష్ణ మోహన్, సర్వే, రెవెన్యూ, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# భద్రతకు మూడో కన్ను సీసీ కెమెరాలు

- **జిల్లా మొత్తం సీసీ కెమెరా నిఘాలోకి రావాలనేది ఆకాంక్ష**
- **సిద్దిపేట సురక్ష నేత్ర'లో భాగంగా ఒకేరోజు జిల్లావ్యాప్తంగా 330 సీసీ కెమెరాల ప్రారంభం**
- **చిన్నతిమ్మాపూర్, బండ మైలారం, గౌరారంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన సీపీ రష్మీ పెరుమాళ్**






**సిద్దిపేట/ములుగు, ఆగస్టు 12 (మనం ప్రతినిధి):** శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు 'మూడో కన్ను'గా పనిచేస్తూ నేరస్థులను త్వరగా గుర్తించి పట్టుకోవడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. సీసీ కెమెరాలు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తే రక్షణకు మంచి భద్రత కల్పించుకోవడం అవసరమని సూచించారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు జరిగిందని బుధవారం ఒక్కరోజు 330 సీసీ కెమెరాలు ఏర్పాటు జరిగినట్లు కమిషనర్ పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న ప్రజలు, వాటి డివిఆర్ బాక్సను ఇతరులకు సులభంగా కనిపించేలా లేదా అందేలా ఉంచకూడదని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని చదువుకున్న వారే సైబర్ నేరాలకు ఎక్కువగా గురవుతున్నారని సీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు. తెలియని లింక్లు క్లిక్ చేయవద్దని నకిలీ ఏపీకే ఫైళ్లను ఇన్స్టాల్ చేయకూడదన్నారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్కు ఫిర్యాదు చేయాలని త్వరితగతిన స్పందిస్తే పోగొట్టుకున్న డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందనీ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసే ముఠాలు పెరిగాయని అలాంటి మోసపూరిత మాటలను నమ్మవద్దని ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.
సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అత్యంత సాంకేతికతతో కూడిన ఏఎన్పిఆర్ కెమెరాలు చాలా ఖరీదైనవని, వాటిని సరిగ్గా నిర్వహించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిరుద్యోగుల కోసం 'సిద్దిపేట ఉద్యోగమిత్ర' ఆన్లైన్ వెబ్ పోర్టల్ ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. యువత ఎలాంటి మత్తు పదార్థాలు, డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, సమాజం పర్యవేక్షించా లన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే 'సిద్దిపేట సురక్ష నేత్ర' ద్వారా జిల్లాలోని అన్ని కాలనీలు, ప్రధాన కూడళ్లు, గ్రామాలు నిరంతర నిఘా నీడలో ఉంటాయని సీపీ తెలిపారు. తమ కాలనీలు, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సిద్దిపేట జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వాములై సహకరించిన కంపెనీలు, ప్రజాప్రతినిధులకు సీపీ రష్మీ పెరుమాళ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఒక రోజే 330 సీసీ కెమెరాల ప్రారంభం... సిద్దిపేట సురక్ష నేత్ర లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం ఒక్కరోజు 330 సీసీ కెమెరాలు ప్రారంభించారు. చిన్న తిమ్మాపూర్, బండ మైలారం, గౌరారం గ్రామాలలో సీపీ రష్మీ పెరుమాళ్ ప్రారంభించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1400 సీసీ కెమెరాలు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈరోజు ప్రారంభించిన గ్రామాలలో నూజివీడు సీడ్స్ కంపెనీ, స్నేహ పౌల్ట్రీ ఫారం యజమాన్యాలు సహకార మన్నించాయి. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు, సిసిపిఎస్ ఏసిపి రాజు , గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు , ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ మొగిలి, ములుగు ఎస్ఐ రఘుపతి , గౌరారం ఎస్ఐ ఆరోగ్యం , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అండ్ డ్రైవ్ కేసుల జైలు శిక్ష

- **ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ**

**గజ్వేల్, ఆగస్టు 12(మనంన్యూస్):** గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారికి జైలు శిక్ష విధించిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఈ కేసుకు సంబంధించిన వ్యక్తులను స్థానిక కోర్టుకు తీసుకువెళ్లగా మేజిస్ట్రేట్ మూల స్వాతి జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే కేసు పూర్వపరాలు పరిశీలించిన అనంతరం జబ్బపూర్ కు చెందిన వల్లపు ప్రసాద్ 27 లు కు 5 రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన దండు రవికి నాలుగు రోజుల జైలు శిక్ష, ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన కుంక నరేష్ కు ఐదు రోజుల జైలు శిక్ష విధించడం జరిగినట్లు ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని గజ్వేల్ పోలీసులు ప్రజలకు సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల అప్రపత్తంగా ఉండాలి



**గజ్వేల్ ఆగస్టు 12 మనం న్యూస్:** డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రవికుమార్ పిలుపునిచ్చారు. గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాణి బ్రేకర్స్ మద్రాస్ లో ఏర్పాటు చేసిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రజలకు సైబర్ మోసాల గురించి లోతుగా వివరించారు. సదస్సులో సీఐ రవికుమార్ మాట్లాడుతూ, సాంకేతికతను సానుకూలంగా వాడుకోవడమే కాకుండా, దాని వెనుక ఉన్న ముప్పులను గుర్తించడం చాలా అవసరమని పేర్కొన్నారు. ఏదైనా సైబర్ ఆర్థిక మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నెంబర్కు కాల్ చేయాలి లేదా ఛిఢ్భటఛిటజీర్ఘ్భ.జౌ౦.జీ్ఞ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన మొదటి గంటలోనే (గోల్డెన్ హౌర్ ) ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది అని సూచించారు. వాట్సాప్, టెలిగ్రామ్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింక్లు, .ఏపీకె ఫైళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ డౌన్లోడ్ చేయవద్దు అని, వీటి ద్వారా మీ ఫోన్ను సైబర్ నేరగాళ్లు తమ ఆధీనంలోకి తీసుకుని బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉంది. బ్యాంక్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది లేదా కస్టమర్ కేర్ ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసే ఎవరికీ కూడా మీ బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్, ఎటిఎం కార్డు వివరాలు లేదా ఓటీపీ లను ఎట్టిపరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దు సూచించారు. పార్ట్టైమ్ ఉద్యోగాలు, టాస్క్ ఆధారిత ఆదాయాలు, విద్యుత్ బిల్లుల బాకీలు, కొరియర్ పార్సెల్స్ నిలిచిపోయాయని వచ్చే నకిలీ కాల్స్, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామనే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండటమే మొదటి రక్షణ అని, ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ను కానీ, సైబర్ క్రైమ్ పోలీసులను కానీ సంప్రదించాలని సీఐ రవికుమార్ కోరారు.

## బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఉదయ్ నాగరాజు ఎంపిక




**సిద్దిపేట, ఆగస్టు 12 (మనం ప్రతినిధి):** సిద్దిపేట జిల్లా శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్కు ఎంపికయ్యారు. తెలంగాణకు చెందిన సిద్దిపేట బిడ్డ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకోవడం గమనార్హం. మాజీ మంత్రి హరీశ్ రావు ఆధ్వర్యంలో సిద్దిపేట విపంచి కళా నిలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు తో కలిసి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పాల్గొని ఉదయ్ నాగరాజు ను శాలువాతో సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించరు.

## పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రోటరీ కృషి

- **రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు సాయి రెడ్డి**
- **కొక్కొండ పాఠశాలలో విద్యార్థులకు షూస్ పంపిణీ**




**ములుగు, ఆగస్టు 12(మనంన్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అంతర్జాతీయ రోటరీ ఎంతగానో కృషి చేస్తున్నదని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కొక్కొండ సాయి రెడ్డి అన్నారు. ములుగు మండలం కొక్కొండ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూస్, సాక్సులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సాయి రెడ్డి మాట్లాడుతూ రోటరీ 3150 ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి పనిచేస్తుందని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ విద్యార్థులకు సైకిలను, బెంచీలను అందజేస్తుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేలా ఇకముందు పనిచేస్తామని చెప్పారు. అనంతరం మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వస్తువులను సమకూర్చడంలో ముందుందని చెప్పారు. పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటిని సరఫరా చేసే దిశగా ఆలోచన చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ను ఆయన అభినందించారు. అనంతరం క్లబ్ కార్యదర్శి బొల్లెపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ చిన్నప్పుడు తాము చదువుకున్న పాఠశాలలోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందించే దిశగా తాము కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజేత వాసు గౌడ్, క్లబ్ కోశాధికారి కరుణాకర్ రెడ్డి, చైర్మన్లు కొడాలి చంటి, కర్ణాకర్ రెడ్డి, జగదీశ్వర్, మాజీ సర్పంచ్ సాయినాథ్ గౌడ్, నాయకులు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రంథాలయ దినోత్సవం

- **గ్రంథాలయాలు భావితరాలకు ఎంతో అవసరం**
- **లైబ్రరీలు కేవలం రీడింగ్ రూములు గా మారవద్దు**

**గజ్వేల్ ఆగస్టు 12 మనం న్యూస్ :** ఆగస్టు 12 జాతీయ గ్రంథాలయ దినోత్సవం గా నిర్వహించుకోవడం జరుగుతుంది. గ్రంథాలయాలు భావితరాలకు ఎంతో అవసరం ఉండేవిధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలంటారు. కళ్ల ముందు ప్రపంచాన్ని ఉంచుతుంది. ఆలోచనలను విశాలం చేస్తుంది. కొత్త మనిషిగా లోకానికి పరిచయం చేస్తుంది. మట్టికరిచిన మనిషిని సైతం పైకిలేపి నిలబెడుతుంది. 'పుస్తకం మనిషిని ఉన్నతీకరిస్తుందని' అంబేద్కర్ మహాశయుడు అందుకే అన్నాడేమో.! ఫేస్బుక్, ట్విట్టర్ ఖాతాలలో వేలకొద్దీ స్నేహితులున్నా దొరకని ఆత్మస్థైర్యాన్ని ఒక పుస్తకం ఇవ్వగలదు. ఓటీటీ, యూట్యూబ్లలో ఉర్రూతలూగించే వెబ్సిరీస్లు చూసినా కలగని ఆనందాన్ని కూడా పుస్తకంతోనే పొందచ్చు. నగరంలో 83 పౌర గ్రంథాలయాలున్నాయి. ప్రతీ లైబ్రరీలో యువతీ, యువకుల సందోహమే! కాకపోతే వారంతా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు. ఈ తరంలో సాహిత్య పఠనాసక్తిని పెంపొందించడానికి మంచి అవకాశం. అయినా అందుకు నడుం కట్టేదెవ్వరు? అటెండర్లే గ్రంథ పాలకులు స్వాభిమాన పోరాటానికి దారి చూపిన గ్రంథాలయాలు ఈనాడు సోయి తప్పాయి. నగర గ్రంథాలయ సంస్థ పరిధిలోని పౌర గ్రంథాలయాలలో రెగ్యులర్ సిబ్బంది 21మంది మాత్రమే పనిచేస్తున్నారు. గ్రంథాలయాలను కొన్నిచోట్ల అటెండర్లు, స్వీపర్లే నిర్వహిస్తున్నారని చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసంగా 60మంది లైబ్రేరియన్లనైనా ప్రభుత్వం నియమించడం ద్వారా మన జ్ఞాన భాండాగారాల స్ఫూర్తి నిలుస్తుందన్నది నిపుణుల అభిప్రాయం. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కొండాపూర్లో కోఫోర్జ్ లైబ్రరీ నగరంలో కొత్త సంస్కృతికి నాంది పలికింది. తెలుగు, హిందీ, ఇంగ్లిషులో 15వేలకుపైగా పుస్తకాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు 365రోజులూ పాఠకులకు ఐటీ కారిడార్లోని ఆ గ్రంథాలయం ఆహ్వానం పలుకుతోంది. తమకు అవసరమైన పుస్తకాలను సభ్యులు ఇంటి నుంచి వెబ్సైట్, యాప్ లాంటి ఆన్లైన్ వేదికల ద్వారా చదివే



వెసులుబాటు ఆ గ్రంథాలయం కల్పిస్తోంది. ఫిన్లాండ్ రాజధాని హెల్సింకిలోని ఓడి సెంట్రల్ లైబ్రరీలో సందర్శకుల కోసం ఆడియో, వీడియో స్టూడియో కూడా అందుబాటులో ఉంచారు. బడంగ్పేటలోని లైబ్రరీలో కాస్తంత మెరుగైన సాంకేతిక సేవలున్నాయని సందర్శకులు చెబుతున్నారు. మన గ్రంథాలయాల్లో పాత పత్రికలు, పుస్తకాలు కొన్ని డిజిటలైజేషన్ అయ్యాయి. కనీసం వాటినైనా పాఠకులకు అందుబాటులో ఉంచాలని సంగిశెట్టి శ్రీనివాస్ కోరుతున్నారు. డిజిటలైజేషన్ చేయాలి అరుదైన రాతప్రతులు, తాళపత్రాలు హైదరాబాద్లో మాత్రమే కొలువుదీరున్నాయి. వాటన్నింటినీ జాగ్రత్తగా డిజిటలైజ్ చేయాలి. లైబ్రరీలు కేవలం రీడింగ్ రూములుగా మిగిలిపోకూడదు. లైబ్రరీలకు రోజూ వస్తున్న పోటీపరీక్షల అభ్యర్థులకు సాహిత్య పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాలి.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో తదుపరి దశకు సన్నద్ధం కావాలి



**ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా.. అక్టోబర్ 19న తుది జాబితా**
**నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత ధృవపత్రాలను సమర్పించాలి**
**ఎస్ఐఆర్పై కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మీడియా సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం, ఆగస్టు 12(మనం బ్యూరో):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామని, తదుపరి దశకు సన్నద్ధం కావాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మీడియాతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్, అనామలీస్, ఫారాలు తిరిగి సమర్పించని ఓటర్ల వివరాలు, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, అవసరమైన ధృవపత్రాల సమర్పణ, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ షెడ్యూల్ను రెండు పర్యాయాలు పొడిగించిందని తెలిపారు. ప్రస్తుతం తొలి దశ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి దశకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

**10 లక్షల 85 వేల 927**
**ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్**

ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 ఎన్యూమరేషన్ ఫారాలు (87.31 శాతం) మేర డిజిటలైజేషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. సేకరించిన ఫారాల్లో 43,131 మంది మ్యాపింగ్ చేయబడలేదని, వీరికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవపత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా తగిన ధృవపత్రాన్ని సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ధృవపత్రాలు అందుబాటులో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, వారికి అవసరమైన ధృవ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఎస్.ఐ.ఆర్. డేటాలో 1,32,736**
**అనామలీస్ గుర్తింపు**

జిల్లాలో 1,32,736 అనామలీస్ గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇది మొత్తం ఫారాల్లో 10.67 శాతం అని చెప్పారు. పేర్ల స్పెల్లింగ్లో తేడాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉండటం తదితర కారణాలతో అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. వీటిని కేవలం డేటాలోని లోపాలుగా పరిగణించకుండా, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం అవసరమైన సవరణలు చేపడతామని తెలిపారు.

**1,57,854 మంది ఎన్యూమరేషన్**
**ఫారాలు సమర్పించలేదు**

జిల్లాలో 1,57,854 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించలేదని కలెక్టర్ తెలిపారు. వీరిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించామని చెప్పారు. క్షేత్రస్థాయి విచారణలో 33,380 మంది మరణించిన ఓటర్లు, 11,004 మంది డబుల్ ఓటర్లు, సుమారు 1,01,000 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మరో సుమారు 11 వేల మంది వివిధ కారణాల వల్ల ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించలేకపోయారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన లో తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

**ఫారం సమర్పించని**
**అర్హులైన ఓటర్లకు మరో అవకాశం**

ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు మరో అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇతర ప్రాంతంలో తనకు ఓటు హక్కు లేదని ప్రకటిస్తూ అవసరమైన డిక్లరేషన్తో పాటు సంబంధిత వివరాలు, ధృవపత్రాలను సమర్పించవచ్చని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులైన పౌరులు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పుట్టిన తేదీకి అనుగుణంగా ఎన్నికల సంఘం సూచించిన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

**నోటీసులు అందుకున్నవారు**
**ఆధారాలను సమర్పించాలి**

ఎన్యూమరేషన్ ఫారంలో ఓటరు గత ఎస్ఐఆర్ ఓటరు జాబితా వివరాలు అందుబాటులో లేకపోవడం లేదా డేటాబేస్లో ఉన్న వివరాలతో సరిపోలక పోవడం వంటి సందర్భాల్లో సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈ ఆర్ ఓ) నోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ, పుట్టిన ప్రదేశాన్ని నిర్ధారించే ఆధారాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఈఆర్ఓ సంబంధిత ఆధారాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

**జనన తేదీ ఆధారంగా ధృవపత్రాల సమర్పణ**

భారతదేశంలో 1987జూలై 1కు ముందు జన్మించిన వారు₹ల్ తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు నిర్ధారించే ధృవ పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులలో ఎవరిదైనా ఒకరి ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవ పత్రాలలో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒకదాన్ని సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.

**క్లెయిమ్స్, అభ్యంతరాలపై**
**విచారణ అనంతరం నిర్ణయం**

ఎన్యూమరేషన్ వివరాలపై వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను ఈఆర్ఓలు నోటీసులు జారీ చేసి, సంబంధిత ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈఆర్ఓలు తీసుకున్న నిర్ణయంపై నిబంధనల ప్రకారం అక్టోబర్ 15 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎస్ఐఆర్పై ప్రజలకు అవగాహన**
**కల్పించడంలో మీడియా సహకరించాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా వాస్తవ సమాచారాన్ని విస్తృతంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, మరణించిన, శాశ్వతంగా తరలివెళ్లిన, డబుల్ నమోదైన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించేలా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్, అనామలీస్, ఓటర్ల వివరాల పరిశీలన, ధృవపత్రాల సమర్పణ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, తదితర అంశాలపై పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ మీడియా సమావేశంలో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- రెండు, మూడు రోజుల వర్షాలను చూసి అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయొద్దు
- భూగర్భ జలాలను పొదుపుగా వినియోగిస్తూ
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలి

**ఖమ్మం, ఆగస్టు 12(మనం బ్యూరో):** ఎల్నినో ప్రభావం కారణంగా రానున్న వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ఎల్నినో పరిస్థితులు, జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్నినో ప్రభావంపై వాతావరణ నిపుణుల అంచనాలు, జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ వివరించారు. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఎల్నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురిసిన వెంటనే సాధారణ వర్షపాతం ఉంటుందని భావించి రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు వెళ్లవద్దని సూచించారు. ఆకాశంలో మేఘాలు ఏర్పడినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు. రైతులు వర్షాలను మాత్రమే కాకుండా భవిష్యత్తులో నీటి లభ్యతను కూడా దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా నీటి ఆధారిత పంటలను సాగు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎల్నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

**భూగర్భ జలాలు**
**6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయి**

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జల మట్టాలు సుమారు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని కలెక్టర్ తెలిపారు. బోర్లు ఉన్నాయనే కారణంతో వ్యవసాయం చేసుకోవచ్చని రైతులు భావించవద్దని సూచించారు. రానున్న నెలన్నర రోజుల్లో భూగర్భ జలాల లభ్యత మరింత తగ్గే అవకాశం ఉందని, ఈ పరిస్థితిని రైతులు ముందుగానే పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీరు అత్యంత విలువైన వనరులని, అందుబాటులో ఉన్న నీటిని ఆచితూచి వినియోగించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వచ్చే జూలై వరకు అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు భవిష్యత్తులో ప్రజల తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**తక్కువ నీటి అవసరమయ్యే పంటల**
**సాగుకు ప్రాధాన్యత**

ప్రస్తుతం జిల్లాలో రైతులకు పొద్దు తిరుగుడు, పప్పుధాన్యాలు, కంది, పెసర తదితర తక్కువ నీటి అవసరమయ్యే పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పప్పు ధాన్యాల విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని కోరారు.సత్తుపల్లి ప్రాంతంలో రైతులు విస్తారంగా వరి సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అక్కడి రైతులకు ఇప్పటికే పలుమార్లు వరి సాగు చేయవద్దని సూచించామని పేర్కొన్నారు. ఎల్నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై వాస్తవ సమాచారాన్ని రైతులకు చేరవేయడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు.

## పెండింగ్ బిల్లుల విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం

- ఆగస్టు 17న జిల్లా కలెక్టరేట్ దగ్గర ధర్నా

**ఖమ్మం, ఆగస్టు 12(మనం బ్యూరో):** పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టి.ఎస్ ని పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర రావు మరియు వారి బృందం కలిసి పలు అంశాలపై ప్రాతినిధ్యం చేశారు . పిఆర్సి అమలు , సిపియస్ రద్దు , పెండింగ్ డి ఏ లు మరియు పెండింగ్ బిల్లుల విడుదల కొరకు ఆగస్ట్ 17న ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కి తెలియచేశారు . జిల్లా విద్యా శాఖకు రెగ్యులర్ డి. ఇ. ఓ. లేకపోవటం వలన ఉపాధ్యాయులకు సర్వీస్ పరమైన విషయాల్లో జాప్యం జరుగుతోందని కావున రెగ్యులర్ డి.ఇ. ఓ. నియామకం కొరకు ప్రాతినిధ్యం చేయటమైనది . ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ను , విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తో మాట్లడనునట్లు తెలియచేశారు . ఇటీవల సస్పెన్షన్ కి గురైన ఖమ్మం అర్బన్ మండల మహిళా ఉపాధ్యాయురాలి రిఇన్స్టేట్ విషయంపై ప్రాతినిధ్యం చేయగా సానుకూలంగా స్పందించి జిల్లా విద్యా శాఖ అధికారికి ఆదేశాలు జారీచేశారు . అనంతరం ఈనెల 17 న ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ దగ్గర ధర్నా చౌక్ లో చేపట్టనున్న ధర్నాకు సంబంధించి ఖమ్మం ఏసీపీ రమణమూర్తి ని కలిసి ధర్నా నిర్వహించడానికి అనుమతి తీసుకున్న జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు . ఈ కార్యక్రమం లో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయ్ అమృత్ కుమార్ , టీ . రత్న కుమార్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రెబ్బా శ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా సోమ్లా , తాళ్లూరి చంద్ర శేఖర్ , లింగం సతీష్ , పత్రికా సబ్ ఎడిటర్ జి.వి.రమణ , వేణుమాధవ్ రావు , ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షులు బొడ్డు రవి కిరణ్ , ఖమ్మం టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుసులూరి శ్రీనివాస్ రావు , ఏ . శాంతా రెడ్డి , తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి అద్దంకి గోపాల క్రిష్ణ , రఘునాథపాలెం మండల భాద్యులు మాతంగి వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు . జిల్లాలోని రాష్ట్ర , జిల్లా మరియు మండల భాద్యులు అన్నీ మండలాల ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొనేలా కృషి చేసి ధర్నా ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు కోరారు .

## సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్ సహకారం

- రూ.. 95.90 లక్షల మూడో, తుది విడత నిధుల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్కు అందజేసిన కేటీపీఎస్ అధికారులు




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 12 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్-7వ దశ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి రూ.95,90,802ల మూడో మరియు తుది విడత నిధుల చెక్కును కేటీపీఎస్-7వ దశ చీఫ్ ఇంజనీర్ బి. శివరామ్ రెడ్డి జిల్లా కలెక్టర్ అంకిత్కు బుధవారం ఐ డి వో సి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ యు. గోపతి పాల్గొన్నారు. కేటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో పాల్వంచ పట్టణంలోని ఇందిరానగర్ నుంచి గిరిజన ప్రాంతమైన జగన్నాధపురం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని వివిధ గ్రామపంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.2,39,70,802 నిధులను కేటాయించారు. ఇప్పటికే విడతల వారీగా నిధులు విడుదల చేయగా, తాజాగా రూ.95,90,802ల మూడో మరియు తుది విడత నిధుల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్కు అందజేశారు. సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు దోహదపడనున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు . ప్రభుత్వ రంగ సంస్థలు సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కేటీపీఎస్-7వ దశ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలోని ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు, విద్యుత్ వెలుగులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడనున్నాయి అన్నారు.

## సింగరేణి పార్క్‌లో సాంస్కృతిక ప్రదర్శనల ఎంపికలు



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 12(మనం న్యూస్):** సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు ఈనెల 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య దినోత్సవ ప్రధాన వేడుకలలో జాతీయ పతాకం ఎగురవేసిన అనంతరం ప్రదర్శించే సాంస్క ృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించే విధంగా ఉండేలా ఎంపికల కార్యక్రమం బుధవారం కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్ నందు జరిగింది. ఈ ఎంపికలకు కొత్తగూడెం పట్టణంలోని గల వివిధ పాఠశాలల కళాశాలల నుండి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా సాంస్క ృతిక ప్రదర్శనలో పాల్గొన్నారు. సాంస్క ృతిక ప్రదర్శనల అనంతరం మెరుగైన ప్రదర్శనల కొరకు తగు సలహాలను సూచనలను అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు తీసుకొనవలసిన మార్పులను చేర్పులను గురించి వివరించారు. ఈ ఎంపిక కార్యక్రమంలో డివైపిఎంలు కే.శివ కుమార్, కే.సునీల్ కుమార్, స్పోరట్స్ సుపర్వైసర్ ఎంసి.ఫాస్నెట్, సేవ కొ ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, స్కౌంట్స్ అండ్ గైడ్స్, వివిధ పాఠశాలల కళాశాలల నుండి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెండింగ్ డి ఏ లు, పెండింగ్ బిల్లుల విడుదల చేయాలి

- కలెక్టర్ కు పీఆర్ టియు వినతి
- 17న జిల్లా కలెక్టరేట్ దగ్గర ధర్నా



**ఖమ్మం, ఆగస్ట్ 12(మనం న్యూస్):** పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ని పి ఆర్ టి యు టి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి పలు అంశాలపై ప్రాతినిధ్యం చేశారు . పిఆర్సి అమలు , సిపియస్ రద్దు , పెండింగ్ డి ఏ లు మరియు పెండింగ్ బిల్లుల విడుదల కోసం ఆగస్ట్ 17 న ధర్నా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కి తెలియచేశారు . జిల్లా విద్యా శాఖకు రెగ్యులర్ డి. ఇ. ఓ. లేకపోవటం వలన ఉపాధ్యాయులకు సర్వీస్ పరమైన విషయాల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. రెగ్యులర్ డి.ఇ. ఓను నియమించాలని కోరారు. ఈ విషయంపై విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తో మాట్లడనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ నెల 17 న ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ దగ్గర ధర్నా చౌక్ లో చేపట్టనున్న ధర్నా విషయమై ఏసీపీ రమణమూర్తి ని కలిసి ధర్నాకు అనుమతి తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయ్ అమృత్ కుమార్ , టీ . రత్న కుమార్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రెబ్బా శ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా సోమ్లా , తాళ్లూరి చంద్ర శేఖర్ , లింగం సతీష్ , పత్రికా సబ్ ఎడిటర్ జి.వి.రమణ , వేణుమాధవ్ రావు , ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షులు బొడ్డు రవి కిరణ్ , ఖమ్మం టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుసులూరి శ్రీనివాస్ రావు , ఏ . శాంతా రెడ్డి , తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి అద్దంకి గోపాల క్రిష్ణ , రఘునాథపాలెం మండల భాద్యులు మాతంగి వెంకట కిషోర్ పాల్గొన్నారు.

## సింగరేణి ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 12 (మనంప్రతినిధి):** సింగరేణి ప్రధాన ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను కలియతిరిగి పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా పిల్లల వార్డు, ప్రసూతి వార్డు, సర్జికల్ వార్డు, ఐసీయూ, పురుషుల వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్రే విభాగం, ఇమ్యునైజేషన్ విభాగం తదితర విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు.ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి మరియు శిశు వైద్యం, శస్త్రచికిత్సలు తదితర సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ , డాక్టర్ ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్, నాగభూషణం, రాంప్రసాద్, సింగరేణి హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కళాశాల అభివృద్ధిలో ప్రగతి ఏది..?

- పీజీ విభాగంలో అరకొర కోర్సులు
- అన్నిరకాల కోర్సులు పెట్టాల్సిందే అంటున్న విద్యార్థులు
- పేరున్న కళాశాలను ప్రగతి పథంలో నడిపించండి
- పూర్వ విద్యార్థుల సింగరేణి యాజమాన్యానికి వేడుకోలు




**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 12(మనం న్యూస్):** సింగరేణి కాలరీస్ ఉమెన్స్ కాలేజీ అభివృద్ధిలో ప్రగతి ఏది అంటూ కొంతమంది పూర్వ విద్యార్థులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ కళాశాలకు ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని రాను రాను ఈ కళాశాల భవిష్యత్తు ప్రశ్నార్థకరంగా మారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కళాశాలలో ఒకప్పుడు సీటు దొరకాలంటే ఎంతో కష్టంగా ఉండేది. అలాంటి కళాశాలను అభివృద్ధిలో మరింత రాణించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు సూచిస్తున్నారు. జిల్లా కేంద్రంగా మారడంతో పాటు కొత్తగూడెం కార్పొరేషన్ కూడా అయిన నేపథ్యంలో సింగరేణి ఉమెన్స్ కాలేజీని అభివృద్ధి బాట పట్టించాలని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఏడాదికి ఏడాది ఉమెన్స్ కాలేజీని రూపురేఖలు మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఉన్న కోర్సులతో పాటుగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సరస్వతి పుత్రులు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు. ప్రస్తుతం ఈ ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ డిగ్రీ విద్యతో పాటు పీజీ విద్య కూడా ఉన్నప్పటికీ ఇందులో కేవలం రెండు మూడు కోర్సులు మాత్రమే ఉండడం వల్ల కళాశాల మరింత బలోపేతం అయ్యే అవకాశం కనబడడం లేదని సింగరేణి మాజీ కార్మికులు మాట్లాడుకుంటున్నారు. మారుతున్న కాలానుగుణంగా సింగరేణి కళాశాలను అభివృద్ధిలో నడిపించేందుకు యాజమాన్యం ప్రత్యేక చొరవ చూపాలని కార్మిక వర్గం పేర్కొంటుంది. ఈ కళాశాలలో ఎంతో మంది చదివి నేడు మంచి మంచి హోదాలో ఉన్నారని కొంతమంది గుర్తు చేయడం గమనించాల్సిన విషయం.

**పీజీలో అరకొర కోర్సులు కాదు..**
**పూర్తిస్థాయిలో పెట్టాలి...**

సింగరేణి ఉమెన్స్ కాలేజీలో పీజీ విభాగంలో అరకొర కోర్సులు కాకుండా పూర్తిస్థాయిలో కోర్సులు ప్రవేశపెట్టే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ప్రస్తుతం ఉమెన్స్ కాలేజీలో పీజీ విభాగానికి సంబంధించిన ఎమ్.ఎస్సీ బాటనీ, ఎమ్.ఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్.కాం కోర్సులు మాత్రమే ఉన్నాయి. ఇంకా ఎమ్.ఎస్సీ జువాలజీ, ఎమ్.ఎస్సీ మ్యాథ్స్, ఎమ్.ఎస్సీ ఫిజిక్స్, ఎమ్.ఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్.ఏ ఇంగ్లీష్, ఎమ్.ఏ ఎకనామిక్స్, ఎమ్.ఏ హిస్టరీ, ఎమ్.ఏ పొలిటికల్ సైన్స్, ఎమ్.ఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎమ్.ఏ తెలుగు, ఎమ్.ఎస్సీ. స్టాటిస్టిక్స్, ఎంబీఏ, ఎం.టెక్, ఎంసీఏతో పాటు తదితర కోర్సులను ప్రవేశపెట్టాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి కోర్సులు లేని కారణంగా అనేకమంది కొత్తగూడెంకు చెందిన విద్యార్థులు వరంగల్ హైదరాబాద్ కు వెళ్లి పీజీ విద్యను అభ్యసించాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. దీనిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి కళాశాలలో పీజీ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కావాల్సిన కోర్సులను ప్రవేశపెట్టినట్లయితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని దీంతో కళాశాల కళకళలాడుతుంటుందని అంతేకాకుండా ఉన్నత విద్యకు సంబంధించిన మరికొన్ని చర్యలు చేపట్టినట్లయితే సింగరేణి ఉమెన్స్ కాలేజీకి మంచి భవిష్యత్తు ఉంటుందని సింగరేణి కార్మికుల పిల్లలు, ప్రజలు పేర్కొంటున్నారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా సాగునీటి ప్రణాళిక

- ఎల్ లినో ప్రభావం -
- ఆరుతడి పంటలే మేలు....
- మంత్రి జూపల్లి కృష్ణారావు




ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 12 (మనం బ్యూరో): ప్రస్తుత నీటి లభ్యత, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రాజెక్టుల కింద ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశంలో, పశుసంవర్థక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సాగునీటి పారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్, ఆర్డీఎస్, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులలో నీటి లభ్యత, నీటి విడుదల, పంటల సాగు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి జూపల్లి తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో జూరాల ప్రాజెక్టుకు కొంతమేర నీరు చేరిందని, దీంతో శ్రీశైలం ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు పెరిగాయని చెప్పారు. అయితే ప్రస్తుత నీటి నిల్వలను అన్ని అవసరాలకు సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు డిసెంబరు వరకు నీటిని అందించాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. మళ్లీ సమృద్ధిగా వర్షాలు కురిస్తే తప్ప ఖరీఫ్ సీజన్కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. సాగునీటి శాఖ అధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. బోర్లు, బావులపై ఆధారపడే రైతులు పరిమితంగా వరి సాగు చేసినా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని జూపల్లి తెలిపారు. అయితే ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీటిని పొందే రైతులు మాత్రం నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 9 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. ఇందులో సుమారు 7 టీఎంసీలను సాగునీటి అవసరాలకు, మరో 2 టీఎంసీలను తాగునీటి అవసరాలకు వినియోగించే అవకాశం ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ నాగార్జునసాగర్తో పాటు ఇతర ప్రాజెక్టులకు కూడా నీటిని విడుదల చేయాల్సి ఉంటుందని వివరించారు. తెలంగాణకు నికర జలాల కేటాయింపులు సాధించడంలో గత ప్రభుత్వం విఫలమైందని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. ప్రాజెక్టుల అంచనా వ్యయాలు, ఖర్చులు భారీగా పెరిగినా వాటి ద్వారా ఆశించిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో 811 టీఎంసీలలో 68.5:31.5 నిష్పత్తి ప్రకారం తెలంగాణకు 512 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్కు 299 టీఎంసీలు రావాల్సి ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం తెలంగాణ వాటాను సరిగా వినియోగించుకోలేకపోయిందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటికి శ్రీకారం చుట్టింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని జూపల్లి అన్నారు. అప్పటి ప్రభుత్వం సుమారు రూ.8,300 కోట్లను సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసిందని తెలిపారు.జ తదుపరి ప్రభుత్వం సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేసి మొత్తం ప్రాజెక్టులను తామే పూర్తి చేశామని చెప్పుకోవడం వాస్తవాలను వక్రీకరించడమేనని మంత్రి ఆరోపించారు. రైతులకు వాస్తవ పరిస్థితులను తెలియజేసి, అందుబాటులో ఉన్న సాగునీటికి అనుగుణంగా పంటల సాగుపై సూచనలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, ముఖ్యంగా ప్రాజెక్టు కాలువల కింద అధిక నీటి అవసరమున్న పంటల సాగును తగ్గించి ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి జూపల్లి కృష్ణారావు మరోసారి విజ్ఞప్తి చేశారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం 9టీఎంసీలు కాగా, గతంలో రీజెనరేటెడ్ నీటి సౌకర్యం ఏ విధంగా ఉండేది, ఇప్పుడు ఏ విధంగా ఉందనే విషయాన్ని ఆరా తీసి దానిపై పూర్తి డేటాను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. రైతులకు మినుము, వేరుశనగ, ఆయిల్ పామ్ పంటలపై పూర్తి స్థాయిలో ప్రచారం కల్పించి, అవగాహన కల్పించాలన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతులు చివరి వరకు నీటి సరఫరా కొనసాగుతుందనే అంచనాతో అధిక నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసి నష్టపోకుండా ముందుగానే అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులకు నీటి లభ్యతపై వాస్తవ పరిస్థితులను దాచకుండా, పారదర్శకంగా ముందుగానే తెలియజేయాలని సూచించారు. ప్రాజెక్టుల్లో ఎంత నీరు ఉంది? ప్రస్తుతం ఎంత నీరు సాగుకు అందుబాటులో ఉంది? ఆయకట్టు పరిధిలో ఎంత విస్తీర్ణానికి నీరు అందించే అవకాశం ఉంది? భవిష్యత్లో నీటి పరిస్థితి ఎలా ఉండొచ్చు? అనే అంశాలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు ఎంత నీరు వస్తున్నాయి, ఎంత వదులుతున్నామనే విషయాలని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. అధికారులు జవాబుదారీతనంతో ప్రజలకు అన్ని వివరాలను, వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడం కరువు పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులకు మనం ఏమి ఇవ్వగలము అదే చెప్పాలని వివరించారు. నాగర్కర్నూల్లో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన,. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, నాగర్కర్నూల్ జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమావేశంలో వివరించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ఆ వివరాలను రైతులకు చేరవేస్తున్నట్లు తెలిపారు.నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను చైతన్యపరచడంతో పాటు, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రస్తుత నీటి వనరుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగును నియంత్రిస్తూ ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కుచుకళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ**

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అందుకు అవసరమైన చర్యలను తీసుకుంటూనే, సాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి ప్రత్యేక పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని నాగర్కర్నూల్ జిల్లాలో ను ప్రతినిమయ్య పంటలైన ఆయిల్ ఫామ్ , ఇతర కూరగాయల సాగుల ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అదేవిధంగా చర్యలను తీసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం సమావేశాల్లో నిర్ణయాలు తీసుకోవడం కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఆయకట్టు ప్రాంతాలను, గ్రామాలను సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. సాగునీటి లభ్యత, పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు తదితర అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. రైతుల సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చురుకైన చర్యలు చేపట్టాలని, సాగు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలు.. పంటలను బట్టి నీటి వినియోగం అనే విధానాన్ని పాటిస్తూ ముందుకు వెళ్లాలని, ఒకేసారి అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు విస్తీర్ణం పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం, రైతులకు ముందస్తు సమాచారం అందించడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ద్వారా సాగునీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అలంపూర్ శాసనసభ్యులు విజయుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు కుష్బూ గుప్త, సీహెచ్ ప్రియాంక, ఆదర్శ్ సురభి, షేక్ రిజ్వాన్ బాషా, ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓఎస్డీ మధుసూదన్ను పరామర్శించిన మంత్రి సీతక్క



ములుగు, ఆగస్టు 12, మనం ప్రతినిధి: హిప్ జాయింట్ రీప్లేస్మెంట్ శస్త్రచికిత్స అనంతరం సికింద్రాబాద్లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన ఓఎస్డీ మధుసూదన్ను రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మధుసూదన్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మధుసూదన్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని సీతక్క ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# హెచ్ఐవీ నివారణకు అవగాహనే ప్రధాన ఆయుధం

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 12 (మనం బ్యూరో): హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు. హెచ్ఐవీపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ముమ్మర ఐఈఇ ప్రచార కార్యక్రమం-2026లో భాగంగా బుధవారం నాగర్కర్నూల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని నాగర్కర్నూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., హెచ్ఐవీపై భయపడాల్సిన అవసరం లేదు.. సరైన అవగాహనతో దానిని నివారించవచ్చు అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. హెచ్ఐవీ వ్యాప్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు అనే విషయాలపై శాస్త్రీయ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత హెచ్ఐవీ/ఎయిడ్స్పై సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల ద్వారా వ్యాప్తి చెందుతున్న అసత్య ప్రచారాలను నమ్మకుండా వైద్య నిపుణులు, ఆరోగ్యశాఖ అందించే విశ్వసనీయ సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని కోరారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల సమాజంలో ఎలాంటి వివక్ష, అవమానం, నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తులను దూరంగా ఉంచడం లేదా వారిని సామాజికంగా వెలివేయడం సరైన పద్ధతి కాదన్నారు. వారికి అవసరమైన వైద్య సేవలు, మానసిక ధైర్యం, కుటుంబ మరియు సామాజిక మద్దతు అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్ఐవీ నివారణపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కేవలం ఒకరోజు కార్యక్రమానికే పరిమితం కాకుండా నిరంతరంగా అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురావాలని అన్నారు. బి పాజిటివ్ టు ప్రివెంట్ హెచ్ఐవి పాజిటివ్ (Be Positive To Prevent HIV Positive) అనే నినాదంతో చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ నివారణ, ముందస్తు పరీక్షలు, వైద్య సేవలు, చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఇమ్మైనైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మీరు చెప్తేనే కాంగ్రెస్కు ఓటు వేసినం

- గాంధీభవన్కు పోతే రానిస్తలేరు
- ప్రెస్క్లబ్లో ఎమ్మెల్సీ కోదండరామ్కు నిరుద్యోగుల నిరసన సెగ
- ఉద్యమ నేతను నిలదీసిన నిరుద్యోగులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ గాంధీ భవన్లో నిరుద్యోగులకు చేదు అనుభవం ఎదురైంది. పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని మంత్రి శ్రీధర్ బాబును కలిసి విజ్ఞప్తి చేసేందుకు గాంధీ భవన్కు వెళ్లిన నిరుద్యోగులను లోనికి రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తమ సమస్యలు చెప్పుకునేందుకు గాంధీ భవన్కు వస్తే? తమను అడ్డుకోని, అక్కడ బయటకు పంపిన తీరుపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచికా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు కనీసం కలిసేందకు కూడా సమమయం ఇవ్వండం లేదని మండిపడుతున్నారు. మీరు చెప్తేనే కాంగ్రెస్కి ఓటు వేసినం.. ఎమ్మెల్సీ కోదండరామ్ను నిలదీసిన నిరుద్యోగులు.. ఇదిలాఉంటే, తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు బుధవారం నిరసన సెగ తగిలింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంచే అంశంపై కోదండరామ్ను నిరుద్యోగులు అడ్డుకున్నారు.

మీరు చెప్తేనే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశామని, మీరు ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదు? అని ఆయనను నిలదీశారు. మీ మాటలు నమ్మి తాము కాంగ్రెస్ పార్టీని గెలిపించామన్నారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మమ్మల్ని పట్టించుకోకపోతే? మీరు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు? మీడియా కూడా మా సమస్యలను కవర్ చేయడం లేదని వాపోయారు. 60 ఏళ్ల మీరు, సుప్రీంకోర్టుకు వెళ్లి ఎమ్మెల్సీ కావొచ్చు?.. కానీ, 30 ఏళ్ల తామంతా ఉద్యోగం చేయడానికి పనికిరామా? అని సూటిగా ప్రశ్నించారు. మా సమస్యలను కవర్ చేయమని మీడియాకు చెప్పండి అంటూ కోదండరాంను నిలదీశారు. దీంతో నిరుద్యోగులకు సమాధానం చెప్పలేక కోదండరాం అక్కడి నుంచి వెనుదిరిగారు.

# తాలిపేరు ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ అంకిత్



- నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి
- ఏకలవ్య మోడల్ పాఠశాల తనిఖీ
- విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

చర్ల, ఆగస్ట్ 12 (మనం న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సందర్శించారు. ప్రాజెక్టులోని ప్రస్తుత నీటిమట్టం, నీటి ప్రవాహం, నీటి విడుదల, ప్రాజెక్టు నిర్వహణ, సిబ్బంది తదితర అంశాలపై ప్రాజెక్ట్ ఏఈ సంపత్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లని ఏఈ కలెక్టర్కు వివరించారు. ఛత్తీస్గఢ్ ప్రాంతం నుంచి ప్రాజెక్టుకు నీటి ప్రవాహం వస్తుందని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నీటి ప్రవాహం తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం నీటి ప్రవాహం స్థిరంగా లేకుండా పెరుగుతూ, తగ్గుతూ కొనసాగుతోందని వివరించారు. బుధవారం సుమారు 2,200 క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తోందని, రానున్న రోజుల్లో ఇది మరింత తగ్గే అవకాశం ఉందని ఏఈ వివరించారు. ప్రాజెక్టు నుండి ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24 వేల 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టులో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, వారి విధులు, ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, గేట్లు, ఇతర యంత్రాంగం నిర్వహణకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, గేట్ ఆపరేటర్లు, పంప్ ఆపరేటర్లను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలని ఏఈ కలెక్టర్ను కోరారు. అనంతరం ప్రాజెక్టు కంట్రోల్ రూమ్ను కలెక్టర్ పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ప్రాజెక్టులోని గేట్ల నిర్వహణ, నీటి ప్రవాహం, నీటిమట్టం తదితర అంశాలను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లను నిర్వహించే విధానం, నీటి ప్రవాహంలో మార్పులను గుర్తించే విధానం, ప్రాజెక్టు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డ్యామ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, ప్రాజెక్టు భద్రత, నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ చర్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.

తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, తరగతులకు హాజరైన విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహన, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల నోట్బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించి, కొంతమంది విద్యార్థులతో పుస్తకాలు చదివించి వారి చదివే సామర్థ్యాన్ని స్వయంగా తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు, వసతుల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు పాఠశాలలోని వంటశాలను పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత, వంట చేసే విధానం, ఉపయోగిస్తున్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం ఎలా ఉందనే విషయాలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేసించారు. పాఠశాల ఆవరణలోని హెల్త్ సెంటర్ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న మందులు, మందుల నిల్వలు, విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా, ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను ఏ విధంగా గుర్తించి చికిత్స అందిస్తున్నారనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్తో పాటు పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి వివరాలను సరిచూశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సాగునీటిని వృదా చేయకుండా ప్రణాళికాబద్దంగా పంటచేలకు సాగునీటిని విడుదల చేయాలని సూచించారు.

విద్యార్థుల విద్య ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విషయాన్ని అర్థం చేసుకుని నేర్చుకునేలా బోధనా పద్ధతులను మెరుగుపరచాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది, హెల్త్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఎంపివో సూర్యనారాయణ మూర్తి, మండల వ్యవసాయ అదికారి లావణ్య, సిడిపివో రేవతి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలి



- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ఆగస్టు 12 మనం ప్రతినిధి :ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో నీటి కొరత వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తప్పనిసరిగా పంటల మార్పిడి మరియు వైవిధ్యీకరణ చేపట్టేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు ఆయన ఐడీఓసీ కార్యాలయంలో భవిష్యత్తులో నీటి లభ్యత మరియు పంటల మార్పిడి అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ఇతర లాభదాయక పంటలు మరియు ఉద్యానవన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 72,000 ఎకరాలలో వరి వేశారని వెల్లడించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని వివరాలు మరియు పురోగతి నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ డేటాలో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మితో పాటు వ్యవసాయ, ఉద్యానవన శాఖల జిల్లా అధికారులు, ఏడీఏ, ఎంఏఓలు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయలో ముగిసిన జాతీయ స్థాయి ఫుట్బాల్ శిక్షణ శిబిరం



వర్గల్ ఆగస్టు12(మనం న్యూస్): వర్గల్ నవోదయ విద్యాలయ ఆవరణలో హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఫుట్బాల్ శిక్షణా శిబిరం బుధవారం విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపల్ రాజేందర్ తెలిపారు. ఈ శిబిరం ఆగస్టు ఒకటవ తేదీ నుండి 12వ తేదీ వరకు 12 రోజులపాటు జరిగిందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ జవహర్ నవోదయ విద్యాలయా నుండి 76 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులకు జాగింగ్ షూస్, ఫుట్బాల్ షూస్, ట్రాక్ సూట్, ఫుట్బాల్ జెర్సీ షార్ట్, గోల్ కీపర్ గ్లౌస్ కూడిన ఫుట్బాల్ కిట్లను అందజేశారు. శిక్షణ పొందిన క్రీడాకారులు ఆగస్టు 20 నుండి 22 వరకు అస్సాం రాష్ట్రం, డిబ్రూగర్, సోనీ తూర్పు జిల్లాలలో జరిగే నవోదయ విద్యాలయ జాతీయ ఫుట్బాల్ టోర్నమెంట్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



## మరణశిక్షను నిషేధించిన లెబనాన్

**బీరుట్ ,ఆగష్టు 12 :** లెబనాన్ పార్లమెంటు మరణశిక్షను మంగళవారం నిషేధించింది. ఈ శిక్షకు బదులుగా కఠిన శ్రమతో కూడిన యావజ్జీవ కారాగారశిక్షను అమలులోకి తెచ్చిన తొలి అరబ్బు దేశంగా నిలిచింది. వాస్తవానికి 2004 నుంచే మరణశిక్షపై అనధికార నిషేధాన్ని లెబనాన్ కొనసాగిస్తోంది. అనేక కేసుల్లో కోర్టులు మరణశిక్షలు విధించినా వాటిని జీవితఖైదుగా మార్పు చేశారు. 128 మంది సభ్యులు కలిగిన లెబనాన్ పార్లమెంటులో మెజారిటీ సభ్యులు మరణశిక్ష నిషేధాన్ని సమర్థించారు. హెజ్బొల్లాకు చెందిన ఎంపీలు మాత్రం వ్యతిరేకించారు. మరణశిక్ష నిషేధాన్ని చారిత్రక ఘట్టంగా న్యాయశాఖ మంత్రి అబ్దుల్ నాసర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. లెబనాన్‌లోని మానవహక్కుల బృందాలు ఈ పరిణామంపై హర్షం వ్యక్తం చేశాయి.

### జింబాబ్వేలో ఘోర ప్రమాదం

# పడవ బోల్తా..

## 15 మంది దుర్మరణం



**హరారే,ఆగష్టు 12 :** జింబాబ్వేలో ఘోర ప్రమాదం జరిగింది. కరీబా సరస్సులో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పడవ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. మరో 27 మంది గల్లంతయ్యారు. ప్రమాద సమయంలో పడవలో 114 మంది ప్రయాణికులతోపాటు ఐదుగురు సిబ్బంది ఉన్నారు. టికెట్లు తీసుకోని చిన్నారులు కూడా ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్లతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రమాదం అనంతరం 77 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడి సరస్సులోని ఓ చిన్న ద్వీపానికి చేరుకున్నారు. ఆ పడవ సామర్థ్యం 90 మందే అని.. అంతకంటే ఎక్కువ మందిని ఎక్కించుకోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. కరీబా సరస్సు జింబాబ్వే-జాంబియా సరిహద్దులో ఉంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కరీబా పట్టణానికి వెళ్లేందుకు పడవలు ఉపయోగిస్తుంటారు.

# వలస లబ్ధికి ఆన్‌లైన్ ధరఖాస్తులు తప్పనిసరి




## అమెరికా నిర్ణయం.. త్వరలో అమలు

**వాషింగ్టన్ ,ఆగష్టు 12 :** వలసదారులు ఇకపై గ్రీన్‌కార్డు, పౌరసత్వం, ఆశ్రయం కోరడం కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే ధరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం త్వరలోనే అమల్లోకి రానుంది. నిర్వహణ వ్యయాల తగ్గింపు, సామర్థ్య పెంపు లక్ష్యాలుగా ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. గత ఆరు నెలలుగా ఈ-ఫైలింగ్ కోసం అందుబాటులో ఉన్న ఏ ధరఖాస్తులనైనా ఇకపై ఆన్‌లైన్‌లోనే సమర్పించాల్సి ఉంటుందని ఫెడరల్ రిజిస్టర్‌లో కొత్త నిబంధనను ప్రచురించింది. కనీసం 60 రోజుల నోటీసు ఇచ్చి ఆన్‌లైన్‌లో మాత్రమే ధరఖాస్తులను అందుబాటులో ఉంచనుంది. మామూలుగా దరఖాస్తుదారులు 'అమెరికా పౌరసత్వ-వలస సేవల' (యూఎస్సీఐఎస్) ఆన్‌లైన్ ఖాతా ద్వారా, లేదా పోస్టు ద్వారా ధరఖాస్తుల్ని పంపించే అవకాశం ఉంది. కొత్త విధానం వల్ల గ్రీన్‌కార్డు ధరఖాస్తులు, వాటి పునరుద్ధరణ, కుటుంబ ఆధార పిటిషన్‌లు, పౌరసత్వ అభ్యర్థనలు, ఉపాధి అధీకృత దరఖాస్తులు, తాత్కాలిక రక్షణ ఉండే ఉద్యోగ హోదా పరమైన దరఖాస్తుల్ని ఆన్‌లైన్‌లోనే స్వీకరిస్తారు. దీనివల్ల సమర్థత పెరిగి, తప్పులు తగ్గడంతోపాటు అవకతవకల్ని గుర్తించడం బలోపేతం అవుతుందని, భద్రతపరమైన వడపోత సులభంగా మారుతుందని యూఎస్సీఐఎస్ చెబుతోంది.

**మినహాయింపు రావాలంటే అభ్యర్థన పంపాలి**

ఎవరైనా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోలేకపోతే ఆ ప్రక్రియ నుంచి మినహాయింపును కోరుతూ అభ్యర్థన దాఖలు చేయాలి. ధరఖాస్తు సమర్పణ రుసుము కింద 25 డాలర్లు చెల్లించాలి. ఒక్కో కేసువారీగా నిర్ణయం తీసుకుంటారు. ధరఖాస్తులను కాగితాల రూపంలో స్వీకరించడం, వాటిని స్కాన్ చేయడం, డేటాను కంప్యూటర్‌లో నమోదు చేయడం, భద్రపరచడం, తపాలాలో పంపించడం వంటి ప్రక్రియలకు భారీగా ఖర్చవుతోందని అమెరికా ప్రభుత్వం చెబుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో యూఎస్సీఐఎస్ 1.4 కోట్లకు పైగా వలస ప్రయోజన అభ్యర్థనలను ప్రాసెస్ చేసింది. లాక్‌బాక్స్ సదుపాయాల ద్వారా సుమారు 45.3 కోట్ల పేజీల కాగితపు పత్రాలు నిర్వహించింది. దీనికోసం 39.60 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. కేవలం తపాలా ఖర్చులకే కోటి డాలర్లకు పైగా వెచ్చించినట్లు వెల్లడించింది. ఆన్‌లైన్‌కు మారితే ఈ ఖర్చులన్నీ తగ్గిపోతాయని ప్రభుత్వం చెబుతోంది.

# సైబర్ నేరగాళ్లకు అడ్డాగా.. మలేసియాలో ఘోస్ట్ సిటీ



**కౌలాలంపూర్ ,ఆగష్టు 12 :** మలేసియాలో అదో విలాసవంతమైన ప్రాజెక్టు. లక్షలాది మంది నివాసం ఉండేలా రూ.వేల కోట్లు ఖర్చు చేసి సకల వసతులతో భారీ నిర్మాణాలు. ఫారెస్ట్ సిటీ పేరిట దశాబ్దం క్రితం నిర్మించిన ఆ ప్రాంతం ప్రస్తుతం సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిపోయింది. స్థానిక పోలీసులు ఇటీవల జరిపిన దాడుల్లో అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టయ్యింది. దీంతో మలేసియాలో 'ఘోస్ట్ సిటీ'గా మారిపోయిన ఆ సాగర తీరప్రాంతం మరోసారి వార్తల్లో నిలిచింది.

చైనాకు చెందిన ఓ సంస్థ మలేసియాలోని 'ఫారెస్ట్ సిటీ' పేరుతో 2016లో భారీ నివాస సముదాయ ప్రాజెక్టును చేపట్టింది. నిర్మాణ ఖర్చు దాదాపు 100 బిలియన్ డాలర్లుగా అంచనా. అత్యాధునిక సదుపాయాలతో సముద్ర తీరంలో నిర్మించిన ఈ టవర్లకు భారీ డిమాండ్ ఉంటుందని అంచనా వేసింది. కానీ, కరోనా విలయం, చైనా ప్రాపర్టీ రంగంలో ఒడుదొడుకులు, పర్యావరణ అనుమతుల్లో జాప్యం తదితర కారణాలతో అనేక సమస్యలు ఎదుర్కొంది. దీంతో లక్షలాది మంది నివాసముండాల్సిన ఈ ప్రాంతంలో కేవలం పది వేల మంది కన్నా తక్కువే ఉంటున్నట్లు సమాచారం. ఇదే అదనుగా భావించిన సైబర్ మోసగాళ్లు అనేక అపార్టుమెంట్లను అద్దెకు తీసుకొని మోసపూరిత కార్యకలాపాలు కొనసాగించడం మొదలుపెట్టారు. ఈ సమాచారంతో ఫారెస్ట్ సిటీలోని 32 చోట్ల స్థానిక పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా సైబర్ మోసగాళ్ల బండారం బయటపడింది. మొత్తం 27 అపార్టుమెంట్లలో కాల్‌సెంటర్లు ఉండటం గమనార్హం. క్రిప్టో, పెట్టుబడి పథకాలతో పాటు ప్రేమ పేరుతోనూ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో 335 మందిని అరెస్టు చేశారు. కోట్లాది రూపాయల నగదు, 300లకుపైగా కంప్యూటర్లు, 1500లకుపైగా మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో 90శాతం మంది చైనీయులే. విదేశాల్లో బాధితుల నుంచి కోట్లాది రూపాయలను కొల్లగొడుతున్నట్లు గుర్తించిన అధికారులు.. ఇంటర్‌పోల్ సహాయం తీసుకుంటున్నారు. వీరిలో ఎక్కువ మంది గతంలోనూ అంతర్జాతీయ స్కాముల్లో భాగమయ్యారని కనుగొన్నారు.

# హర్మ్యూజ్‌పై సంపూర్ణ నియంత్రణ అమెరికాదే

## అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్,ఆగష్టు 12 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆ దేశంతో జరుగుతోన్న చర్చలపై తమకు నమ్మకం లేదని.. వారు ఎప్పుడూ తనకు అబద్ధాలే చెబుతారని అన్నారు. హర్మ్యూజ్ జలసంధిపై సంపూర్ణ నియంత్రణ అమెరికాకే ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం జలసంధి తమ అధీనంలోనే ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గినా.. దుందుడుకు చర్యలకు పాల్పడినా కఠిన ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**హర్మ్యూజ్‌లో నౌకపై అమెరికా దాడి..**

హర్మ్యూజ్ జలసంధిలో ఒమన్ వద్ద ఓ నౌకపై అమెరికా దాడి చేసింది. ఇరాన్ రేవులపై తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘించడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. పనామా జెండా కలిగిన 'వేలా నోవా' కార్గో నౌకపై నేవీ హెలికాప్టర్ రెండు క్షిపణులను ప్రయోగించిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ దాడిలో సిబ్బంది ఎవరైనా గాయపడ్డారా అనే విషయాన్ని వెల్లడించలేదు.

**పనామా కాల్వపై పెరిగిన ఒత్తిడి..**

హర్మ్యూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండడంతో పనామా కాల్వలో నౌకల రద్దీ పెరిగినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో ఎల్నినో ప్రభావం వల్ల కాలువలో నీటి మట్టం తగ్గుతున్నట్లు పేర్కొన్నాయి. దీంతో దానిగుండా ప్రయాణించే ఒక్కో వాణిజ్య నౌక నుంచి పనామా కాలువ అథారిటీ 4 మిలియన్ డాలర్లు వసూలు చేస్తున్నట్లు తెలిపాయి. ఓ భారీ నౌక పనామా దాటాలంటే 10 రోజుల వెయిటింగ్ పిరియడ్ ఉన్నట్లు తెలుస్తోంది.



# దుస్తుల్లో ఫోన్.. పెన్ డ్రైవ్

## జైలు అధికారులకు దొరికిన ప్రజ్వల్ రేవణ్ణ

**బెంగళూరు, ఆగష్టు 12 :** ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిసున్న విషయం పాఠకులకు తెలిసిందే.

ప్రస్తుతం పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఆయన.. తన దుస్తుల్లో రహస్యంగా ఫోన్ దాచుకున్నట్లు క్రైమ్ బ్రాంచ్ అధికారులు గుర్తించారు. ఆయన వద్ద పెన్ డ్రైవ్ కూడా లభ్యమైనట్లు వెల్లడించారు. దీంతో ఈ ఎలక్ట్రానిక్ పరికరాలు జైలు లోపలికి ఎలా వచ్చాయనే దానిపై దర్యాప్తు చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు సీనియర్ జైలు అధికారిని సస్పెండ్ చేశారు. భద్రతా లోపాలపై వివరణ కోరుతూ జైలు సూపరింటెండెంట్ కుమార్ కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## షార్ట్ కట్ కోసం వెంపర్లాడితే.. కట్టై పోతారు జాగ్రత్త

### మాజీ రాష్ట్రపతి కోవింద్ రచన 'ట్రియంఫ్ ఆఫ్ ద ఇండియన్ రిపబ్లిక్ : మై లైఫ్ మై స్ట్రగుల్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ప్రధాని మోడీ



**ఢిల్లీ, ఆగష్టు 12 :** ప్రధాని నరేంద్ర మోడీ జెన్జీ యువతకు కీలక సూచన చేశారు. షార్ట్ కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఫుట్ బ్రిడ్జిలను వాడకుండా రైల్వే ట్రాక్లను దాటుతుంటారని మోడీ గుర్తుచేశారు. అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. "మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండి" అని మోడీ సూచించారు.

ఇటీవల కాలంలో మోడీ జెన్జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ మీడియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్ స్టా లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ట్రంఫ్ ఆఫ్ ద ఇండియన్ రిపబ్లిక్ : మై లైఫ్ మై స్ట్రగుల్' పేరిట కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం ఢిల్లీలో జరిగింది.

# కొనసాగుతున్న నీట్ తప్పుల ఎపిసోడ్

## నీట్ పీజీ అభ్యర్థులకు తప్పుడు మెసేజ్

**ఢిల్లీ, ఆగష్టు 12 :** నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే కొందరు అభ్యర్థులకు సెంటర్ వివరాలు తప్పుగా వెళ్లాయి. సాంకేతిక సమస్య కారణంగా ఈ పొరపాటు జరిగినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ బుధవారం స్పష్టం చేసింది. సరైన సెంటర్ వివరాలతో అభ్యర్థులకు మళ్లీ ఎస్ఎంఎస్, ఈ మెయిళ్లు పంపినట్లు పేర్కొంది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష సెంటర్లను ఎన్బీఈఎంఎస్ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు బోర్డు తెలిపింది. గతంలో వచ్చిన ఎస్ఎంఎస్ను పరిగణనలోకి తీసుకోకుండా అధికారిక పోర్టల్లో వివరాలను సరిచూసుకోవాలని స్పష్టం చేసింది. నకిలీ వెబ్సైట్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని సూచించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30న పరీక్ష నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

నీట్ పీజీ 2026 దరఖాస్తుల్లో ఫొటో, సంతకం, వేలి ముద్ర నిబంధనలకు అనుగుణంగా లేని అభ్యర్థులకు ఎన్ బీఈఎంఎస్ చివరి అవకాశం ఇచ్చింది. ఆగస్టు 15 రాత్రి 11.55 గంటల వరకు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ గడువులోగా తప్పులను సరిచేయకపోతే దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉందని బోర్డు స్పష్టం చేసింది. అభ్యర్థులు ఎన్ బీఈఎంఎస్ అధికారిక వెబ్సైట్లో తమ వివరాలతో లాగిన్ అయి.. అప్లోడ్ చేసిన ఫొటో, సంతకం, బొటనవేలి ముద్ర ఆమోదం పొందాయో లేదో చూసుకోవాలని పేర్కొంది. నిబంధనలకు సరిపోని వాటిని గడువులోగా సరిచేయాలని తెలిపింది. పరీక్షతో పాటు కౌన్సెలింగ్, ప్రవేశ ప్రక్రియ పూర్తయ్యే వరకు దరఖాస్తులో ఇచ్చిన ఈమెయిల్, మొబైల్ నంబర్ను అందుబాటులో ఉంచుకోవాలని బోర్డు సూచించింది. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వాటి ద్వారా పంపే అవకాశం ఉన్నందున అభ్యర్థులు తరచూ పరిశీలించుకోవాలని పేర్కొంది.

## నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ 20వేల పేజీల ఛార్జిషీట్

### విచారణకు ఫాస్ట్రాక్ కోర్టు సిద్ధం



**ఢిల్లీ, ఆగష్టు 12 :** నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం ఇటీవల దేశాన్ని కుదిపేసింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్ను ఢిల్లీలోని ప్రత్యేక ఫాస్ట్రాక్ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దాదాపు 20 వేల పేజీల ఛార్జిషీట్ను సమర్పించినట్లు సమాచారం. "360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చాం" అని సీబీఐ అధికారి ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులోని అభియోగాలపై న్యాయస్థానం గురువారం నుంచి వాదనలు వినే అవకాశం ఉంది.

## తైక్వాండో గిన్నిస్ వరల్డ్ రికార్డ్'లో ఓ మా అకాడమీ



**నల్లకుంట,(ఆగస్టు 12):** హైదరాబాద్‌కు చెందిన, ఓ మా టైక్వాండో అకాడమీ కి చెందిన బ్లాక్ బెల్ట్ నాలుగవ డాన్,ప్రసన్న ఆంజనేయులు ఈ'గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ చూపించారు. తైక్వాండో క్రీడా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ, స్థాయిలో ప్రపంచ నిలిచిపోయేలా'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' సాధించేందుకు నిర్వహించినట్లు 30 సార్లు గిన్నిస్ రికార్డు సాధించిన గ్రాండ్ మాస్టర్ ఎం.జయంత్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎం.జే.ఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆరట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. 9 న ఉదయం 7 నుండి 10 గంటల వరకు హైదరాబాద్లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ భారీ 'లార్జెస్ట్ తైక్వాండో లెసన్' రికార్డు ప్రయత్నం జరిగిందని తెలిపారు.

## మహారాష్ట్ర సీఎస్‌తో సంజయ్ జాజు భేటీ



**హైదరాబాద్, ఆగష్టు 12:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ-2047' విజన్ తదితర అంశాలను శ్రీ సంజయ్ జాజు వివరించారు. తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు.

అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ-2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

# ఓపెన్ స్కూల్ ద్వారా 78 మంది ఖైదీల ఉత్తీర్ణత

- **ప్రత్యేక రిమిషన్ ప్రకటించిన జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా**

**హైదరాబాద్, ఆగష్టు 12 :** ఖైదీల విద్య, పునరావాసం.. సమాజంలో తిరిగి గౌరవప్రదంగా జీవించేలా చేయడంలో భాగంగా తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న నిరంతర కార్యక్రమాల్లో మరో కీలక ముందడుగు పడింది. ఖైదీలు తమ విద్యను కొనసాగించి SSC పూర్తి చేసుకునే అవకాశం కల్పించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఖైదీల చదువుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు, అవసరమైన చోట అదనంగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా నియమించారు. వీరి వేతనాలను తెలంగాణ జైళ్ల శాఖ భరించింది. సంబంధిత జైళ్లలోని అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల చదువును నిరంతరం పర్యవేక్షిస్తూ, మార్గనిర్దేశం చేశారు.

ఒక సంవత్సరం పాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా రెగ్యులర్ తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ-బోర్డ్ పరీక్షలు నిర్వహించి పరీక్షలకు ఖైదీలను సిద్ధం చేశారు. ఈ నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 78 మంది ఖైదీలు SSC పరీక్షలో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. ఖైదీలకు సులభంగా అర్థమయ్యేలా, భవిష్యత్తులో ఉపాధి మరియు జీవనోపాధికి ఉపయోగపడే విధంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం మరియు ప్రతికూల పరిస్థితులను అధిగమించాలనే సంకల్పాన్ని డీజీ ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పానికి ఈ విజయం నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తమ అనుభవాలను పంచుకున్నారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఖైదీలందరికీ డైరెక్టర్ జనరల్ రిమిషన్‌ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. విద్య, స్వీయాభివృద్ధి ఖైదీలకు ఇది ప్రేరణగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

## 100 శాతం టారిఫ్‌ల అంశాన్ని ట్రంప్-మోడీ పరిష్కరిస్తారు

### ట్రంప్ సలహాదారు పీటర్ నవారో

**వాషింగ్టన్ ,ఆగష్టు 12 :** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు అంశంపై ట్రంప్, మోడీ చర్చించి సమస్యను పరిష్కరించుకుంటారని ట్రంప్ సలహాదారు పీటర్ నవారో తెలిపారు. ఇరువురు నేతలకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయంలో ఎవరు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత భారత్ ఆ దేశం నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచిందని నవారో చెప్పారు. యుద్ధానికి ముందు రష్యా చమురు వ్యాపారంలో భారత్ పెద్దగా భాగస్వామి కాదని, తర్వాత కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని తెలిపారు. రష్యా చమురు ఉత్పత్తులను భారత్ కొనడం ద్వారా ఆ దేశానికి పరోక్షంగా లాభం చేకూరిందని గతంలో తాను పేర్కొన్నట్లు చెప్పారు. అయితే తన వ్యాఖ్యలపై భారత్‌లో సామాజిక మాధ్యమాల ద్వారా తీవ్ర విమర్శలు వచ్చాయని నవారో తెలిపారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇలాంటి స్పందనలు ఉపయోగపడవని సూచించారు. రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించేలా అమెరికాలో లిండ్సే గ్రాహమ్ బిల్లు ప్రతిపాదించారు.అయితే మోడీ, ట్రంప్ మధ్య చర్చలతో ఈ వివాదానికి పరిష్కారం లభిస్తుందని నవారో విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎస్సీ ఎస్టీలకు సంక్షేమ పథకాలు అందేటట్లు చూడాలి



- **ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**నల్లగొండ --ఆగస్టు 12 (మనం ప్రతినిధి ):** షెడ్యూల్ కులాలు, తెగల వారి అభివృద్ధి కి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పకడ్బందీగా అమలు కావాలని రాష్ట్ర షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన కమిషన్ సభ్యులతో కలిసి నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సీ ,ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ సి ల కై వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కాగా వినియోగించాలని,దారి మళ్లించవద్దని, ఒకవేళ దారి మళ్ళి ఇస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు .ఎస్సీ, ఎస్టీ ఆవాసాలలో చేపట్టేందుకు మంజూరైన పనులు ఇతర పనులకు మళ్లించకూడదన్నారు. ఎక్కడైనా సబ్ ప్లాన్ నిధులు మిగిలిపోతే తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రోడ్లు, ఇతర పనులు చేపట్టాలన్నారు. ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఎస్సీ ,ఎస్టీలకు తప్పనిసరిగా ఆర్ఓఆర్ అమలు చేయాలని, ఈ విషయంలో అన్యాయం జరిగితే కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు. ఎంపీ నిధులు నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్ డి ఎఫ్ నిధులను రిజర్వేషన్ ప్రకారం కేటించాలన్నారు. మిర్యాలగూడ డివిజన్లో శూన్యపహాడ్, గణేష్ పహాడ్ రోడ్డు వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తో కోరారు .జిల్లాలో ఎస్సీ, ఎస్టీల పై దాడులకు సంబంధించి కోర్టు కేసులు జాప్యం లేకుండా పరిష్కరించాలని , శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఎక్కువమంది ఎస్సీ ఎస్టీలే పనిచేస్తున్నందున పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై తక్షణమే విచారణ నిర్వహించి కమిషన్ కు నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. చండూరు మండలం అంగడిపేటకు చెందిన ఎస్సీ మహిళ మేకల బుచ్చమ్మ ఇంటి వివాదం కేసును విచారించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ దాడుల కేసుల్లో బాధితులకు అందించాల్సిన కోటి 89 లక్షల రూపాయల పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా తెప్పించేందుకు ప్రయత్నిస్తామని, అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న వారికి, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు తెప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు .ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రితో నిర్వహించనున్న హై పవర్ కమిటీలో వీటన్నిటిపై సమీక్షించి నిధులు మంజూరు చేయమని కోరనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని గుడితాండ పునరావాస కేంద్రానికి సంబంధించి 130 మందికి పరిహారం రాని విషయంలో సమగ్ర విచారణ నిర్వహించి వారికి న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ ను ఆదేశించారు. నల్గొండ జిల్లా కేంద్రం బై పాస్ వద్ద అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను రోడ్డు నుండి తొలగించకుండా కమిటీ వేసి విచారణ నిర్వహించాలని నిర్ణయం తీసుకోవాలన్నారు. షెడ్యూల్ కులాలు,తెగల వారిపై జరిగిన దాడులు ,హత్యలు, అత్యాచార కేసుల్లో ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్న అడ్వకేట్ దర్శన్ కు గన్ మెన్ ను పునరుద్ధరించాలని జిల్లా ఎస్పీతో కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగాలలో రిజర్వేషన్ పాటించాలని, ప్రమోషన్లలో ఎవరికి అన్యాయం జరగకుండా చూడాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వెయ్యి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారని ,మరో వెయ్యి ఇండ్లు ఇస్తామని తెలియజేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు కేటాయించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరనున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ ల పై దాడుల కేసుల పరిష్కారం, డ్రగ్స్ అరికట్టడంలో పోలీసు, రెవెన్యూ శాఖలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. నల్గొండ బైపాస్ లో ఉన్న మహాత్ముల విగ్రహాలను అక్కడినుండి కదిలించవద్దని, ఎస్సీ, ఎస్టీల పై దాడుల కేసులకు సంబంధించిన అడ్వకేట్ దర్శన్ కు గన్మెన్ రక్షణ కల్పించాలని, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అవుట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకానికి సంబంధించిన అంశంపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ కేసులో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చేయాలని, శూన్య పహాడ్ ,గణేష్ పహాడ్ రోడ్డుకు సంబంధించిన సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహక మొత్తాన్ని ఇప్పించడంలో చొరవ తీసుకోవాలని కోరారు. మరో సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేకూర్చేందుకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పర్యటిస్తున్నదని, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కి ఇతర రాష్ట్రాలలో సైతం ఎస్సీ, ఎస్టీలపై అధ్యయనం చేయడం జరిగిందని, నల్గొండ జిల్లాలో గతంలో కంటే కేసుల పరిష్కారం ఎంతో మెరుగ్గా ఉందని, ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో అగ్రవర్ణాల ఆధిపత్యానికి అరికట్టే చర్యలు తీసుకోవాలని, గుడితాండా ఆర్ అండ్ ఆర్ లో తండ్రులకు నష్టపరిహారం రాగా, కొడుకులకు ప్యాకేజీ రాలేదని, ఈ విషయంపై ప్రత్యేకంగా విచారణ నిర్వహించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్ కులాలు, తెగల వారి పై దాడులకు సంబంధించి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి రెండుసార్లు సమావేశాలు నిర్వహించామని, రెవిన్యూ ,పోలీస్ తరపున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎస్సీ, ఎస్టీల కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ప్రతి నెల క్రమం తప్పకుండా పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఎస్సీ ,ఎస్టీల ప్రజల హక్కులు కాపాడడంలో వారి ఇబ్బందులను తీర్చేందుకు శాయ శక్తుల కృషి చేస్తున్నామని, డివిజన్ ,మండల స్థాయిలలో కూడా అధికారులు ఎస్సీ, ఎస్టీ ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా నల్గొండ జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుతోపాటు ,నిరంతర సమీక్షలు, దాడులలో బాధితులకు నష్టపరిహారం ఇప్పించడం, క్రమం తప్పకుండా పౌర హక్కుల దినం నిర్వహించడం చేస్తున్నామని, ప్రతి సంవత్సరం జిల్లాలో 90 నుండి 100 వరకు ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు నమోదు అవుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 54 కేసులు విచారణలో ఉండగా, ఇప్పటివరకు 6 కేసుల్లో కోర్టుల ద్వారా శిక్షణ కూడా విధించడం జరిగిందని వెల్లడించారు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సుంకు ధనలక్ష్మి, బెజ్జం సైదులు, మరో సభ్యులు అనిత, భీమనపల్లి సైదులు, భాస్కర్ తదితరులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కింద సబ్ ప్లాన్ కింద లోన్లు ఇప్పించాలని, బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ ,ఎస్టీ ,బీసీ సంక్షేమ శాఖల అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ లో ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ఉద్యోగులను నియమించాలని, ఎస్సీలు కేసులు పెట్టినప్పుడు త్వరిత గతిన పరిష్కరించాలని, ఆర్ ఓ ఆర్ తప్పనిసరిగా పాటించేలా చూడాలని ,ఎస్సీ ,ఎస్టీ వాడల్లో టాయిలెట్స్ నిర్మించాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ఎస్సి వాడల్లో సిసి రోడ్లు, డ్రైన్లు వేయించాలని ,ఎస్సీ కాలనీలలో సారా అరికట్టాలని, గ్రామాలలో చట్టాలపై అవగాహన కల్పించాలని, అంగడిపేట మేకల బుచ్చమ్మ కేసును త్వరితగతిన పరిష్కరించాలని,అలాగే కనగల్ కేసులను పరిష్కరించాలని కోరారు. పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ సి,ఎస్ టి ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కే. లక్ష్మీనారాయణ, కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమకరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,సాంఘిక సంక్షేమ శాఖ డిడి శశికళ, డిటిడిఓ కమలాకర్ ,డి.ఎఫ్.ఓ రాజశేఖర్, డిఆర్ఓ దశరథ్, ఆర్డీవోలు,డిఎస్పీలు, పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమీక్ష కోసం జిల్లా చేరుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సభ్యులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పుష్పగుచ్చలను అందజేసి ఘన స్వాగతం పలికారు.

## కలెక్టర్ రాహుల్ శర్మ

# చేయూత దరఖాస్తులు స్వీకరించాలి



**భూపాలపల్లి ఆగస్టు 12 మనం ప్రతినిధి:** చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం కింద అర్హులైన కొత్త లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడిఓసి కార్యాలయం నుండి చేయూత సామాజిక భద్రత పింఛన్లు కొరకు దరఖాస్తులు స్వీకరణ, జలసిరి, ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహణ, వనమహోత్సవం తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్, మున్సిపల్, వైద్య, ఎక్సైజ్ తదితర అంశాలపై ఐడిఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయూత పింఛన్ల కొత్త మంజూరుకు సంబంధించి సెర్ఫ్ సర్క్యులర్ ప్రకారం అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా మరియు డయాలసిస్ బాధితులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్, గ్రీవెన్స్ కార్యక్రమాల్లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకున్నట్లైతే అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో దరఖాస్తు చేయని వారు, అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా కొత్తగా అర్హత సాధించిన వారు మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆగస్టు 31, 2026లోగా స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి/ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారి/మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్, వయస్సు ధృవీకరణ, రేషన్ కార్డు లేదా అవసరమైన ఆదాయ ధృవీకరణ, బ్యాంకు పాస్బుక్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు సంబంధిత పింఛన్ వర్గానికి అవసరమైన ప్రత్యేక ధృవీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. పింఛను కొరకు దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని తెలిపారు. అన్ని ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయంలో చేయూత హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి పింఛన్లు కొరకు దరఖాస్తు చేయు వ్యక్తులకు సహాయతను అందించాలని తెలిపారు. జలసిరిలో చేపట్టిన ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓలు, ఏపీఎంలను కలెక్టర్ ఆదేశించారు. విఓలకు కేటాయించిన లక్ష్యం మేర ఫామ్ పాండ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత ఇంకుడు గుంతలు, పెర్కొలేషన్ ట్యాంకులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, బోర్వెల్ రీఛార్జ్ వంటి జలసిరి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో ప్రజావాణి నిర్వహణకు ఎంపీడీఓను నోడల్ అధికారిగా వ్యవహరించాలని సూచించారు.

అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే నమోదు చేసేందుకు హెల్ప్డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, డేటా ఎంట్రీ సదుపాయం ఏర్పాటు చేయాలని, అర్జీలు రాయడంలో ప్రజలకు సహాయం అందించాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు, తగినన్ని కుర్చీలు, దివ్యాంగుల కోసం వీల్చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఎక్సైజ్ ఈఎస్ కిరణ్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటరత్నం మండల కేంద్రాల నుంచి తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ అభివృద్ధికి ఐటీడీఏ కీలకం.. తరలిస్తే తీవ్ర నష్టం

- **బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాడి రామరాజు నేత**



**ఏటూర్ నాగారం, ఆగస్టు 12 మనం ప్రతినిధి:** ఏటూరునాగారంలో కొనసాగుతున్న ఐటీడీఏను ములుగుకు తరలించే ప్రయత్నాలు జరిగితే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ డా. జాడి రామరాజు నేత అన్నారు. బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల అభివృద్ధిలో ఐటీడీఏ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా వస్తున్న నిధులతోనే అనేక గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఐటీడీఏకు 1/70 చట్టంతో సంబంధం లేదని, కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నీటిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికీ, ఏజెన్సీ ప్రాంత రైతులకు సాగునీరు, తాగునీరు అందించడంపై స్థానిక నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదని రామరాజు నేత నిలదీశారు.అలాగే ఏటూరునాగారం బస్సు డిపో విషయంలో గతంలో జరిగిన అన్యాయాన్ని గుర్తు చేస్తూ, బస్సు డిపోను మైదాన ప్రాంతానికి తరలించిన ఘటనకు వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు, నిరాహార దీక్షలు చేపట్టి డిపోను తిరిగి సాధించుకున్నామని తెలిపారు. రెవెన్యూ డివిజన్ విషయంలోనూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏను ఏటూరునాగారం నుంచి ములుగుకు తరలిస్తే ఏజెన్సీ ప్రాంతం దశాబ్దాల పాటు వెనుకబడే ప్రమాదం ఉంది. ఆదివాసీ, దళిత, బహుజన, మైనార్టీ వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులు దీనిపై స్పందించాలి అని ఆయన కోరారు. ఐటీడీఏను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామరాజు నేత పేర్కొన్నారు.

# 6 కోట్లతో 10 వేల మెట్రిక్ టన్నుల గోదాములు

- **వెలుగుపల్లి మల్లన్నగుట్టలపై నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే**

**తుంగతుర్తి, ఆగస్టు 12,(మనం న్యూస్):** తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలోని మల్లన్న గుట్టలపై గిడ్డంగుల సంస్థల ఆధ్వర్యంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తుంగత ర్తి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంస్థలు, రహదారు లు, వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావ డమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

### రూ.29 కోట్లతో కోర్టు భవనానికి కృషి

తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో రూ.29 కోట్ల అంచనా వ్యయంతో కోర్టు భవన నిర్మాణానికి కృషి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కోర్టు భవనం అందుబాటులోకి వస్తే న్యాయపరమైన సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని అన్నారు.

### ఫైర్స్టేషన్.. వంద పడకల ఆసుపత్రి

నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.



### డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి

తిమ్మాపురం నుంచి వెంకే పల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే సామేల్ స్పష్టం చేశారు.

### త్వరలో 3వేల ఎకరాల సీలింగ్ భూమి పంపిణీ

నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలోని ఎర్ర పహాడ్ గ్రామ దేశముక్ జేన్నారెడ్డి కుటుంబానికి చెందిన సుమారు 3 వేల ఎకరాల సీలింగ్ భూమిని 2వేల మంది రైతులకు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మద్దిరాల మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి నిర్మించడంతోపాటు 15వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,పానుగంటి నరసింహారెడ్డి, మద్దిరాల మండల అధ్యక్షుడు పచ్చిపాల వెంకన్న, నూతనకల్ అధ్యక్షుడు మల్లారెడ్డి,పోలేపాక రామచంద్రు, దాసరి శ్రీను, పాల్వాయి నాగరాజు, దీప్లా నాయక్, నల్లు రామచంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మృతి

- **వైద్యుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి**
- **చంటి ప్రభు**

**సంగారెడ్డి ఆగస్టు12 మనం న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా, చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన గర్భిణీ అనిత సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరిన అనంతరం మృతి చెందడం తీవ్ర విషాదకరమని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు డిమాండ్ చేశారు. అనిత మూడు రోజుల క్రితం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరినట్లు, అయితే ఆసుపత్రిలో ఉన్న సమయంలో తగిన వైద్య సేవలు అందలేదని కుటుంబ సభ్యులు, బద్రిగూడెం గ్రామ యువకులు మరియు గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయాన్ని వారు చంటి ప్రభు దృష్టికి తీసుకురావడంతో, సమాచారం అందిన వెంటనే ఆయన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా డ్యూటీ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరుపై బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి



వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ను కలిసి ఘటనకు సంబంధించిన విషయాలను వివరించి, బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్ నుంచి తగిన స్పందన రాకపోవడంతో ఆసుపత్రి వెలుపల గ్రామస్తులు, యువకులు మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ కలాలి వినోద్ కుమార్ గౌడ్, బచ్చుకూడం ప్రవీణ్, మాణిక్యంతో పాటు చౌటకూర్ మండలానికి చెందిన యువకులు, బద్రిగూడెం గ్రామస్తులు మరియు పలువురు బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఘటనపై స్పందిస్తూ చంటి ప్రభు మాట్లాడుతూ, వైద్య నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన పరిహారం మరియు న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో, ఆందోల్ నియోజకవర్గానికి చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ,సొంత నియోజకవర్గంలోని ఒక దళిత మహిళ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం మరియు మంత్రి వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని చంటి ప్రభు అన్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే, రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్య ప్రజలకు అందుతున్న వైద్య సేవల పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రభుత్వం ఆలోచించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపరచడంలో ప్రభుత్వం విఫలమైతే, పేద మరియు మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాజీనామా చేయాలని చంటి ప్రభు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# గొట్టిపర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



అంబేద్కర్ చౌరస్తాలో గ్రామస్తుల నిరసన

**తుంగతుర్తి, ఆగస్టు 12,(మనం న్యూస్):** ప్రాంతీయ గ్రామమైన గొట్టిపర్తిని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గొట్టిపర్తి మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో బహుజన ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చింతకుంట్ల హరిబాబు అధ్యక్షతన గ్రామస్తులు నిరసన చేపట్టారు. బుధవారం గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి, మండల కేంద్రం ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇది నిరసన కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గ్రామ సర్పంచ్ చిలకల వెంకన్న మంజుల హాజరై సంఘీభావం వ్యక్తం చేసి మాట్లాడారు. గొట్టిపర్తి గ్రామం చుట్టుపక్కల గ్రామాలకు భౌగోళికంగా అనుకూలంగా ఉండటంతో పాటు, ప్రజలకు రవాణా పరంగా కూడా అందుబాటులో ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గొట్టిపర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వైద్యం, రెవెన్యూ తదితర సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ప్రజలు సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గొట్టిపర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని గొట్టిపర్తిని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తమ డిమాండ్ ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సోమన్న, మండల సాధన కమిటీ సభ్యులు చింతకుంట్ల పరమేష్, కోతి కోటి యాకయ్య,సురేష్, నగేష్, శంకర్, నిమ్మల కృష్ణ, పాశ, శరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల వేగం పెంచాలి

**సూర్యాపేట, ఆగస్టు 12 (మనం ప్రతినిధి):** ఇందిరమ్మ మోడల్ కాలనీజి ప్లస్ వన్ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలి అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. బుధవారం హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ... అర్హులకే ఇండ్లు ఇస్తాం లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్నామని తెలిపారు. చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి బ్లాక్లో ఇన్స్పెక్షన్లు ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు



ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం

ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్లు, స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు.

### 1805 మందితో తాత్కాలిక జాబితా

ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగిస్తామని, నిజమైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు పిడి హౌసింగ్ జబ్బర్ హేహ్మద్, తహసిల్దార్ కవిత మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, గుత్తేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డ్ రాజయ్య ఉద్యోగ విరమణ సన్మానం

**సూర్యాపేట, ఆగస్టు 12 (మనం ప్రతినిధి):** జిల్లా పోలీస్ భరోసా సెంటర్లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న రాజయ్య బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ రాజయ్య దంపతులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో సుదీర్ఘంగా 32 సంవత్సరాల పాటు పని చేసి ప్రజలకు సేవలు అందించి, ప్రజల మన్ననలు పొందిన రాజయ్య సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం అభినందనీయమన్నారు.



శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా, ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలో హోంగార్డు ఇంచార్జీ రిజర్వ్ ఇన్స్పెక్టర్ నారాయణరాజు, ఆర్ఎస్ఐ అశోక్, రాజయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని రాజయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# హెచ్ఐవి నివారణపై అవగాహన పెంపొందించాలి

- కలెక్టర్ డా. సత్య శారదా



**వరంగల్, ఆగస్టు 12(మనం ప్రతినిధి ):** హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వరంగల్ జిల్లాలో రెండు నెలల ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ను బుధవారం ప్రారంభించారు. ఎంజీఎం హాస్పిటల్ అకాడమిక్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాప్తి మార్గాలు, నివారణ పద్ధతులు, ముందస్తు పరీక్షలు, చికిత్స సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు డీఏపీసీయూ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాంపెయిన్లో భాగంగా 200 గ్రామాలు, 200 పాఠశాలలు, 50 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఎంపిక చేసిన ప్రాంతాల్లో 4 వేల ఇళ్లలో ఇంటింటి ప్రచారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు, 100 బైక్లతో ప్రజా అవగాహన ర్యాలీ చేపట్టనున్నారు. BREAK FREE APP ద్వారా డిజిటల్ రిస్క్ అసెస్మెంట్, హెచ్ఐవి పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవితో ప్రభావిత పిల్లలకు కలెక్టర్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్వో డా. బి. రాజా రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రామ్ కుమార్ రెడ్డి, వైద్యాధికారులు, డీఏపీసీయూ సిబ్బంది, ఎన్జీఓ ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పరకాల పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 12 (మనం ప్రతినిధి ):** ఈ నెల 16న పరకాల పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, బారికేడింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, భద్రతా చర్యలు, హెలిప్యాడ్, తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పార్కింగ్ ప్రాంతాలను ముందుగా గుర్తించి, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సిబ్బంది, వైద్య బృందాలు, అంబులెన్స్లు అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వీఐపీ రాకపోకలు, ప్రజల ప్రవేశం, అత్యవసర మార్గాలకు సంబంధించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రవి, గణేష్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్డీవోలు, జెడ్పీ సీఈవోలు, పోలీస్, ఆర్అండ్బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, ట్రాన్స్పోర్ట్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్ పట్టణ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం



- కలెక్టర్ చాహత్ బాజ్పేయ్

**హనుమకొండ, ఆగస్టు 12 (మనం ప్రతినిధి ):** పట్టణాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలు, సమర్థవంతమైన పాలనా వ్యవస్థలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ఇజ్రాయెల్లోని వివిధ నగరాల్లో అర్బన్ వాటర్ మేనేజ్మెంట్పై నిర్వహించిన అధ్యయన పర్యటనలో కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్లో పట్టణ నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం, నీటి మౌలిక వసతుల నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి కొరతను సవాలుగా కాకుండా సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థవంతమైన పాలన ద్వారా అవకాశంగా మార్చుకోవడంలో ఇజ్రాయెల్ అనుభవాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. సముద్రపు నీటిని శుద్ధి చేసి వినియోగించడం, శుద్ధి చేసిన మురుగునీటిని దాదాపు 90 శాతం వరకు వ్యవసాయ అవసరాలకు పునర్వినియోగించడం, ఎఐఖి ఆధారిత నీటి మౌలిక వసతుల మ్యాపింగ్, నాన్-రెవెన్యూ వాటర్ (ౖాఖి)ను 5 శాతం కంటే తక్కువ స్థాయిలో నియంత్రించడం వంటి విధానాలు పట్టణ నీటి నిర్వహణలో ఇజ్రాయెల్ సాధించిన పురోగతికి నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా నదుల పునరుజ్జీవనం, పట్టణ జల వనరుల పరిరక్షణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, ఎడారీకరణ నివారణకు చేపడుతున్న పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నీటి నిర్వహణలో విస్తృతంగా వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసినట్లు తెలిపారు. అధ్యయన పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్లో భారత రాయబారి శ్రీ జె.పి. సింగ్ను కలుసుకుని భారత్-ఇజ్రాయెల్ సహకారం, ముఖ్యంగా పట్టణ నీటి నిర్వహణ రంగంలో ఇరు దేశాల మధ్య ఉన్న అవకాశాలు, అనుభవాలపై ఆయన నుంచి విలువైన సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నట్లు కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ తెలిపారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా పొందిన అనుభవాలు వరంగల్ నగర అండర్గ్రౌండ్ సీవరేజ్ సిస్టమ్ (ఎఖిఖి), తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, ఎఐఖి ఆధారిత నీటి మౌలిక వసతుల నిర్వహణ, నాన్-రెవెన్యూ వాటర్ తగ్గింపు, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పట్టణ చెరువులు, కుంటలు, ఇతర జల వనరుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాల్లో ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అధ్యయన పర్యటనలో ఖమ్మం జిల్లా కలెక్టర్తో పాటు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యే, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ డైరెక్టర్లు, పట్టణాభివృద్ధి రంగానికి చెందిన అధికారులు, పాల్గొన్నారు.

## పాఖాల సమీపంలో అరుదైన పాము



**నర్సంపేట ఆగస్టు 12(మనం న్యూస్ ):** ఖానాపురం మండలం అశోక్ నగర్ (పాకాల) సమీపంలో అరుదైన, అత్యంత విషపూరితమైన 'బ్యాండెడ్ క్రైట్' (ఆ్చ్ఛీఛీ ఓట్చజ్టీ) పాము ప్రత్యక్షమైంది. శరీరమంతా నలుపు, పసుపు రంగు చారలతో ఉన్న ఈ సర్పం స్థానికుల కంట పడింది. సమాచారం అందుకున్న గ్రామానికి చెందిన శ్రీకాంత్, శ్రవణ్, నవీన్, ప్రకాష్ అనే యువకులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. పాముకు గానీ, ఎవరికీ గానీ ఎలాంటి హాని కలగకుండా దానిని సురక్షితంగా పట్టుకుని, వెంటనే పాకాల అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఊఖ్ర్ ధర్మ, జయప్రకాష్, విజయ్, రాజు, మహేష్లతో కూడిన అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని పామును ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం దానిని పాకాల అభయారణ్యంలోకి తీసుకెళ్లి సురక్షితంగా విడిచిపెట్టారు. పామును చాకచక్యంగా పట్టుకుని అటవీశాఖకు అప్పగించిన స్థానిక యువకులను అటవీ అధికారులు అభినందించారు.

# మౌలిక వసతుల విస్తరణపై పార్లమెంట్లో ప్రశ్నించిన ఎంపీ



**హనుమకొండ ఆగష్టు 12(మనం ప్రతినిధి ):** వరంగల్ జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు 4జీ, 5జీ మొబైల్ సేవల విస్తరణ, నెట్వర్క్ బ్లాక్స్పాట్ల తొలగింపు, కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటు తదితర అంశాలపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో జిల్లాలో మొబైల్ కనెక్టివిటీ విస్తరణ స్థితి, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరై ఏర్పాటు చేసిన టవర్ల వివరాలు, నెట్వర్క్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరణ కోరారు. వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం సమాధానమిచ్చారు. జూన్ 2026 నాటికి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 218 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 217 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ, 216 గ్రామాలకు 4జీ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. 47 గ్రామాల్లో 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒక్క గ్రామం కూడా నెట్వర్క్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదని, 4జీతోపాటు 5జీ సేవలను కూడా విస్తరించాలని వరంగల్ ఎంపీ కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ సేవలు, డిజిటల్ లావాదేవీలకు నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న నిధులను సద్వినియోగం చేసుకుని వరంగల్లో మిగిలిన నెట్వర్క్ లోటుపాట్లను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడమే నా లక్ష్యం అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు.

## ముస్లింల అభ్యున్నతికి పాటు పడతా

- కాంగ్రెస్ పార్టీ ములుగు మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజోద్దీన్

**ఏటూర్ నాగారం,ఆగస్టు 12, మనం ప్రతినిధి:** ఏటూరు నాగారం మండల కేంద్రంలో ముస్లిం మైనారిటీ యువకులు,నాయకులతో ములుగు జిల్లా మైనార్టీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాజుద్దీన్ మాట్లాడుతూ తన పై నమ్మకం తో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు గా నియమించిన మంత్రి సీతక్క కు రుణపడి ఉంటానని అన్నారు.మంత్రి సీతక్క మైనారిటీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని ఈ సందర్భంగా తాజుద్దీన్ తెలిపారు. ఈ నెల 16 వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ములుగు జిల్లా పర్యటన నేపథ్యంలో మైనారిటీ సోదరులు, నాయకులు, యువకులు, జిల్లాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు,కార్యకర్తలు అందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని తాజోద్దీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటూరు మైనారిటీ మండల అధ్యక్షుడు సిరాజ్,జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్, మండల ఆత్మ కమిటీ డైరెక్టర్ ముస్తఫా,జిల్లా నాయకులు అయ్యూబ్,సలీం, సర్కార్,అబ్దుల్లా , వలి,వాజిద్ , రిజ్వాన్, అలీ,అన్నూ తదితరులు పాల్గొన్నారు

# ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, ఆగస్టు 12 (మనం ప్రతినిధి ):** జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని కంప్లైంట్ బాక్స్ను పరిశీలించారు. అనంతరం వివిధ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సమస్యలపై వివరాలను తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంజీఎం డైట్ సెంటర్ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు అందించే డైట్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్చార్జిలను ఆదేశించారు. ఈ సందర్భనలో సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్,డాక్టర్ అశ్విన్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# సాగు నీటి వనరులపై సమగ్ర నివేదిక అందించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ఆగస్టు 12 మనం ప్రతినిధి:** సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల నీటి నిల్వలపై సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం నాడు ఐడిఓసి కార్యాలయంలో ఇరిగేషన్, మిషన్ భగీరథవ్యవసాయ శాఖలతో నీటి లభ్యత, పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో నీటి నిల్వలు, మంచినీటికి నీటి నిల్వలు, ఆయకట్టు పరిధిలోని సాగునీటి అవసరాలపై సమగ్ర నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత నీటి నిల్వలు, ఇన్ఫ్లో, అవుట్ఫ్లో, ఆయకట్టు పరిధి, రైతుల అవసరాలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించి, నీటి లభ్యత, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు సాగునీటి వినియోగంపై తగిన మార్గదర్శకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఎస్పీ, అడిషనల్ ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్.

**సంగారెడ్డి, ఆగస్టు 12 మనం న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సీఎం రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల వాహన తనిఖీలు



**మహాదేవపూర్ ఆగస్టు 12 మనం న్యూస్ :** అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బొమ్మాపూర్ క్రాస్రోడ్ వద్ద బుధవారం నాడు మహాదేవ్పూర్ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, సురక్షితంగా ప్రయాణించడం గురించి అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్పూర్ సిఐ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం. సాంబమూర్తి, ఏ ఎం వి ఐ సుందర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై ఫైన్లు విధించగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ద్విచక్ర వాహనాలు, బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి, వాహనాలను జాగ్రత్తగా నడపాలని పోలీసులు సూచించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలిపారు.

## యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్

**భూపాలపల్లి ఆగస్టు 12 మనం ప్రతినిధి:** సమాజం లో యువత భాద్యతా యుతంగా వ్యవహ రించాలని లీగల్ ఏయిడ్ కౌన్సిల్ శ్రీనివాస్ అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యువజన దినోత్సవం లో ఆయన మాట్లాడుతూ యువత బాధ్యతాయుతంగా మసులుకోవాలని, భావిభారత నిర్మాణంలో పాలుపంచుకోవాలని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణం లోని ఒక ప్రయివేటు కళాశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, న్యాయసేవాధికార సంస్థ సీనియర్ అసిస్టెంట్ జి.సురేందర్, సిబ్బంది అంబాల దేవేందర్, కళాశాల సీనియర్ అధ్యాపకులు ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

**మహాదేవపూర్ ఆగస్టు 12 మనం న్యూస్:** సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై మహాదేవపూర్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవపూర్ ఎస్ఐ ఎం. సాంబమూర్తి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 నంబర్కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే 1908 నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**కాటారం, ఆగస్టు 12( మనం న్యూస్):** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీపీ) నాయకులు డిమాండ్ చేశారు . బుధవారం తహసీల్దార్ నాగరాజును కలిసి 29 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి 2023 జూలై నుంచి అమలు చేయాలని కోరారు. ఏళ్లుగా పెండింగ్లో ఉన్న డీఏలను విడుదల చేయడంతో పాటు వివిధ పెండింగ్ బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో గండు రాజబాబు, బొల్లం సతీష్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, శ్రీధర్, భోజ్యానాయక్, సతీష్, మోహన్, గణపతి నాయక్, సడవలి, అనిల్, రాజారాం, రమేష్, రాజేందర్, సమ్మయ్య, పరమేశ్వర్ పాల్గొన్నారు.

# దేశానికి గర్వకారణం.. గురుకుల ఆణిముత్యం రిష్విత!

- ఇటలీ సెయిలింగ్ ఛాంపియన్షిప్ విజేతలకు ఘన సత్కారం
- క్రమశిక్షణ, సమిష్టి కృషితోనే అంతర్జాతీయ ఖ్యాతి
- బీసీ సంక్షేమ, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, ఆగష్టు 12(మనం న్యూస్): అంతర్జాతీయ క్రీడా యవనికపై తెలంగాణకు చెందిన బీసీ గురుకుల విద్యార్థిని విశ్వరూపం ప్రదర్శించి దేశ కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన సంగతి విధితమే.. ఇటలీలోని ప్రసిద్ధ గార్డా సరస్సు వేదికగా గత నెల 30 నుండి ఈ నెల 7 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్షిప్ (ప్రమోషనల్ క్లాస్)'లో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) విద్యార్థిని ఎస్.రిష్విత రజత పతకంతో మెరిశారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచిన రిష్వితతో పాటు, ఈ ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటిన మరో ఇద్దరు గురుకుల విద్యార్థులను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి వారికి శాలువాలు కప్పి, స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరించారు.

క్రీడా పాలసీతోనే గ్లోబల్ వేదికలపై పతకాలు:

ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రీడా వేదికలపై మన గురుకుల విద్యార్థులు పతకాల పంట పండించడం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా యావత్ భారతదేశానికి గర్వకారణమని ప్రశంసించారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన క్రీడా విధానం ద్వారానే గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగుచూస్తోందని, ఇలాంటి అంతర్జాతీయ సత్ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఆయన స్పష్టంచేశారు. విద్యార్థులకు వారి ఆసక్తి గల క్రీడల్లో ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక ప్రోత్సాహం, అత్యాధునిక శిక్షణను వారు అద్భుతంగా సద్వినియోగం చేసుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. కఠినమైన క్రమశిక్షణ, సమయ పాలన, సమిష్టి కృషితోనే రిష్విత అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఈ అరుదైన గుర్తింపు తీసుకువచ్చిందని మంత్రి కొనియాడారు. భవిష్యత్తులోనూ గురుకుల విద్యార్థులు క్రీడల్లో గ్లోబల్ స్టార్స్‌గా రాణించేందుకు ప్రభుత్వం అన్ని రకాల మద్దతునందిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి (సెక్రటరీ) బి. సైదులు, క్రీడా విభాగం ఉన్నతాధికారులు, శిక్షకులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను, వారి పట్టుదలను కొనియాడారు. సాధారణ గురుకుల పాఠశాలల నుండి అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లు రూపుదిద్దుకోవడంపట్ల రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## భర్త పాదాలకు పూజలు చేసిన టాలీవుడ్ హీరోయిన్





టాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్ ప్రణీత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2010 సమయంలో ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అందాల తార ప్రణీత, బావ సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకున్నారు. ఆ తర్వాత అత్తారింటికి దారేది సినిమాలో స్పెషల్ రోల్ చేసి ఇరగదీశారు. హీరోయిన్ గా ఆమెకు పెద్దగా అవకాశాలు కలిసి రాకపోయినా...సెకండ్ హీరోయిన్ గా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఇక 2021లో బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నితిన్ రాజును వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం తన ఫ్యామిలీతో జాలీగా గడుపుతున్న ప్రణీత, సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటారు.

తాను చేసే ఆక్టివిటీని సోషల్ మీడియాలో నిత్యం పంచుకుంటూ ఉంటారు. ఈ తరుణంలోనే తన భర్త పాదాలకు పూజ చేస్తూ నమస్కరించిన ఓ ఫోటోను నటి ప్రణీత సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానికి భీమన అమావాస్య అనే క్యాప్షన్ కూడా ఇచ్చారు. ఈ భీమన అమావాస్య అనేది కర్ణాటకతో పాటు దక్షిణాదిలోని పలు ప్రాంతాలలో జరుపుకునే హిందూ సంప్రదాయ పండుగ. ఆ రోజున భర్త ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మహిళలు పూజలు చేస్తారు. ఆషాడ మాసంలో చివరి రోజున అమావాస్య నాడు ఈ పండుగను జరుపుకుంటారు. ఇందులో భాగంగానే తన భర్త నితిన్ రాజుకు పూజ చేసిన ఫోటోను నటి ప్రణీత పంచుకున్నారు. గతంలో కూడా ఇలాగే పూజలు చేసిన ఆమె, ఫోటోలు షేర్ చేశారు.



## ఇటీవలే క్రికెట్‌కు గుడ్ బై.. కొత్త పాత్రలోకి అజింక్య రహానే

భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే క్రికెట్ కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. టీమ్ఇండియా తరఫున పదిహేనేళ్లపాటు క్రికెట్ ఆడాడు. ఐపీఎల్ లోనూ ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు గుడ్ బై చెప్పిన తర్వాత ఏం చేస్తాడనేదానికి



సమాధానం దొరికింది. మరో మూడు రోజుల్లో శ్రీలంక - భారత్ జట్ల మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కు వ్యాఖ్యాతగా అజింక్య రహానే వ్యవహరించనున్నాడు. ఈ మేరకు రహానే, సోనీ స్పోర్ట్స్ నెట్ వర్క్స్ సీఆర్వో, బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తమ కామెంట్రీ ప్యానల్ లోకి రహానేను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు రాజేశ్ తెలిపారు.

''భారత్ - శ్రీలంక జట్ల మధ్య టెస్టు సిరీస్ కు వ్యాఖ్యాతగా అరగేంట్రం చేయనుండటం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. క్రికెట్లో టెస్టు ఫార్మాట్ కు తిరుగులేదు. భారత్ తరఫున కొన్నేళ్లు టెస్టు మ్యాచులు ఆడా. ఇప్పుడు ఆటను మరో కోణంలో చూడబోతున్నా. నా అనుభవాలు, ఆటలోని మలుపులను అభిమానుల ముందుకు తీసుకొస్తా. నా బ్రాడ్ కాస్ట్ అనుభవం ఫ్యాన్స్ ను అలరిస్తుందని అనుకుంటున్నా'' అని రహానే వెల్లడించాడు.

## ఈ ఆగ్రహానికి కారణమేంటో అర్థం కావట్లేదు: పీవీ సింధు



ఆగస్టు 17 నుంచి ప్రారంభంకానున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఇండియా ఓపెన్ సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోతుల బెడదను నివారించేందుకు లంగూర్ల (కొండ ముచ్చులు) శబ్దాలను అనుకరించే ముగ్గురు నిపుణులను నియమించింది. ఈ చర్యపై సోషల్ మీడియాలో కొందరు వ్యంగ్యంగా స్పందించగా వారికి భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు కౌంటర్ ఇస్తూ నిర్వాహకులు చేపట్టిన ప్రయత్నాలను మెచ్చుకున్నారు. 'ఈ పరిష్కారాన్ని చూసి కొందరు నవ్వొచ్చు. కానీ, వారి (బీఏఐ) కృషిని అభినందించాలి' అని ఎక్స్లో పోస్టు పెట్టారు. సింధు పోస్టుకు కొంతమంది నెటిజన్లు 'కోతుల సంగతి పక్కన పెట్టు.. ముందు టోర్నమెంట్లో బాగా ఆడటంపై దృష్టిపెట్టు'' అని కామెంట్లు పెట్టారు. ఆ కామెంట్లపై సింధు స్పందించారు. టోర్నమెంట్లో మంచి ప్రదర్శన చేయడానికి వంద శాతం కృషి చేస్తానని.. కానీ ఈ ఆగ్రహానికి కారణమేంటో అర్థం కావట్లేదని పేర్కొన్నారు. వింబుల్డన్లో కోర్టులను పావురాలు రెట్టలతో పాడు చేయకుండా ఉండేందుకు డేగను సెక్యూరిటీగా పెట్టారని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడైనా ప్రధాన క్రీడా ఈవెంట్లను నిర్వహించేటప్పుడు స్థానికంగా కొన్ని సవాళ్లు ఉంటాయన్నారు. టోర్నమెంట్ కు ఎలాంటి ఆటంకాలు కలగొద్దనే ఉద్దేశంతో కోతుల బెడదను నివారించేందుకు చేసిన ఏర్పాటును ఎందుకు చర్చనీయాంశం చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదని సింధు పేర్కొన్నారు.

## మీకు అభిమానులు వద్దా.. జాన్వీకపూర్ పిటిషన్ పై హైకోర్టు

నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం దాఖలు చేసిన పిటిషన్ పై దిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో ఉన్న ఆమె ఫ్యాన్ క్లబ్ లు, అభిమానుల పేజీలపై పూర్తిస్థాయిలో నిషేధం విధించేందుకు కోర్టు నిరాకరించింది. జాన్వీపైఅభ్యంతరకర వ్యాఖ్యలు, విమర్శలతో పాటు, డీప్ఫేక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి అశ్లీల కంటెంట్ తయారు చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వీటికి సంబంధించిన కొన్ని ఫ్యాన్ పేజీ లింక్ లతో పాటు 4000 వెబ్ సైట్ లింక్ లను కూడా కోర్టుకు సమర్పించారు.

దీనిపై దిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. విమర్శలు, ఆన్ లైన్ దూషణలు ప్రజా జీవితంలో భాగమైపోయాయని పేర్కొంటూ .. ఆమెకు సంబంధించిన అన్ని అభిమాన సంఘాలపై నిషేధం విధించడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ''అశ్లీలత, తీవ్రమైన అభ్యంతరకర కంటెంట్ ఉంటే చర్యలు తీసుకోవచ్చు. కానీ అన్ని ఫ్యాన్ క్లబ్ లను ఎలా మూసివేయగలం?'' అని ప్రశ్నించింది. అన్ని ఫ్యాన్ పేజీలు తప్పుగా ప్రవర్తించడం లేదని, కొన్ని కేవలం అభిమానంతోనే క్రియేట్ చేసి ఉండొచ్చని కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా 'మీకు అభిమానులు వద్దా?' అని ప్రశ్నించిన కోర్టు.. ఫ్యాన్ పేజీలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

## సినిమాల్లో అవకాశాలు రావని భయపడ్డా: సమంత



నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. ''మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను'' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్ లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్నీ చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుంది'' అని పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతం



ప్రముఖ నటుడు ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైనట్లు హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ లో తెలిపాయి. ప్రత్యేక వైద్యనిపుణుల బృందం ఆయనకు ఆర్థోస్కోపిక్ సర్జరీని నిర్వహించినట్లు వెల్లడించాయి. ఎన్టీఆర్ ఆరోగ్యంగా ఉన్నారని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు పేర్కొన్నాయి. రెండు, మూడు నెలల్లో ఆయన పూర్తిగా కోలుకుంటారని వైద్యబృందం తెలిపింది. ఇటీవల జిమ్ లో కసరత్తులు చేస్తుండగా, ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

## 'ఇరుముడి' ట్రైలర్ రిలీజ్..ఇరగదీసిన రవితేజ



మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా సినిమా ఇరుముడి. ప్రియా భవాని శంకర్, సాయి కుమార్ ప్రత్యేక పాత్రలలో కనిపించనున్న ఈ ఇరుముడి సినిమాకు శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. జీవి ప్రకాశ్ సంగీత స్వరాలు సమకూర్చారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో వచ్చిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా రిలీజ్ అయింది.

ఇందులో తండ్రి సెంటిమెంట్, రవితేజ డైలాగ్స్ అదిరిపోయాయి. రవితేజతో పాటు కూతురు పాత్ర చేసిన బేబీ నక్షత్ర కూడా అదరగొట్టింది. ఇక ఈ ట్రైలర్ లో జీవి ప్రకాశ్ ఆఎిస ఇరగదీశారు. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్, ఇరుముడి సినిమాకు హైప్ తీసుకువచ్చింది. మరి థియేటర్లలో జనాలను ఏ మాత్రం ఆకట్టుకుంటుందో చూడాలి. భక్తి నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా ఈనెల 21వ తేదీన థియేటర్స్ లలో విడుదల కానుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.